# కవితా కౌముది - 2009



శ్రీ

కౌముది

మీ ముంగిట్లో సాహితీ వెన్నెల

www.koumudi.net

ప్రచురణ సంఖ్య: 125

# విషయ సూచిక


| ఏడాది | నెల | కవిత | కవి / కవయిత్రి | పేజి |
|---|---|---|---|---|
| 2009 | 1 | జీవిత సత్యం | శ్రీరాం కుమార్ భాగవతుల | 5 |
| | | పునర్నిర్మాణం | విజయభాను | 6 |
| | | అమ్మ చిన్నప్పుడు | తమస్విని | 7 |
| | | ఊహానందం | కోడూరు శ్రీ పాండురంగారావు | 9 |
| | | రసరేఖలు | బచ్చోటి శ్రీధర్ | 11 |
| | | | | |
| 2009 | 2 | నేను | పి.వాణి | 12 |
| | | రెండు చేతులు | రామా చంద్రమౌళి | 13 |
| | | ఏమని నిర్వచించను | విజయ భాస్కర్ | 14 |
| | | మేఘావృతం | రాగసుధ వింజమూరి | 16 |
| | | రసరేఖలు | బచ్చోటి శ్రీధర్ | 16 |
| | | | | |
| 2009 | 3 | కాలం తీరు | టి.శ్రీవల్లీ రాధిక | 18 |
| | | అందమైన వికృత ముఖచిత్రం | జ్వలిత | 20 |
| | | శిశిరంలో వసంతం | స్వాతి శ్రీపాద | 22 |
| | | నానీలు | పెరుగు రామకృష్ణ | 23 |
| | | రసరేఖలు | బచ్చోటి శ్రీధర్ | 23 |
| | | | | |
| 2009 | 4 | లక్ష్మీం..క్షీర సముద్రరాజ తనయాం.. | ఎమ్వీయస్ రామ్ ప్రసాద్ | 25 |
| | | భావాలు | చావలి విజయ | 26 |
| | | తమసోమా జ్యోతిర్గమయ | హేమ వెంపటి | 28 |
| | | చివరి మజిలీలో కలిసిన స్నేహమా! | మిరియాల శ్రీ సత్య భ్రమరార్జున ఫణి ప్రదీప్ | 29 |

| | | | | |
|---|---|---|---|---|
| | | ఆ వైపే | డా.చిల్లర భవానీ దేవి | 30 |
| | | వసంతం | డా.గోపాల్ నేమాన | 30 |
| | | రసరేఖలు | బచ్పోటి శ్రీధర్ | 32 |
| | | | | |
| 2009 | 5 | ఓటెవ్వరికి? | విజయశ్రీ నాదెళ్ళ | 34 |
| | | ధర | జొన్నలగడ్డ ఆశాకిరణ్ | 35 |
| | | ఆశ(యం) | కోడూరు శ్రీవెంకటేశ్వర స్వామి | 35 |
| | | నిన్నలో నేడు - నేటిలో రేపు | అశ్వినిశ్రీ | 36 |
| | | ప్రేమ | మధుకుమార్ నేదునూరి | 37 |
| | | రసరేఖలు | బచ్పోటిశ్రీధరరావు | 37 |
| | | | | |
| 2009 | 6 | మాయావి | కల్పనా రెంటాల | 39 |
| | | రెండు జళ్ళ సీత - మూడు ముళ్ళ రాధ | వేద | 42 |
| | | ఓ సంధ్య | డా. సురేంద్ర కె.దారా | 43 |
| | | ఎదురు చూపు | వింజమూరి రాగసుధ | 44 |
| | | నువ్వు నేను | తమస్విని | 45 |
| | | రసరేఖలు | బచ్పోటిశ్రీధర్ | 45 |
| | | | | |
| 2009 | 7 | ప్రయాణం | విజయభాను | 47 |
| | | మానవుడు | ఆనంద్ సూరంపూడి | 48 |
| | | తడిసిన గతం | కొండూరు ఆత్రేయ | 49 |
| | | కాంతి పుష్పం | కొత్త ఝాన్సిలక్ష్మి | 50 |
| | | రసరేఖలు | బచ్పోటిశ్రీధర్ | 52 |
| | | | | |
| 2009 | 8 | అమ్మ నిజం | రవి కిరణం | 53 |
| | | మనిషి నామోషీ | సాంజీశ్రీరామ్ | 53 |
| | | నిరీక్షణ | సన్నిహిత్ | 54 |

| | | | | |
|---|---|---|---|---|
| | | మైకేల్ జాక్సన్ | డా.కల్లూరి శ్యామల | 55 |
| | | రసరేఖలు | బచ్చోటిశ్రీధర్ | 57 |
| | | కిట్టుడు | ఉమ చింతలపాటి | 58 |
| | | | | |
| 2009 | 9 | మోహకలాపం | వింజమూరి రాగసుధ | 59 |
| | | గుర్తులు | బొల్లోజు బాబా | 59 |
| | | నాకింకేమీ వద్దు | ఆత్రేయ కొండూరు | 60 |
| | | స్వప్న మేఘం | కె క్యూబ్ వర్మ | 61 |
| | | మూగవీణ | గరిమెళ్ళ నాగేశ్వర రావు | 62 |
| | | రసరేఖలు | బచ్చోటిశ్రీధర్ | 63 |
| | | | | |
| 2009 | 10 | ఆగని ప్రయాణం | వారణాసి నాగలక్ష్మి | 65 |
| | | దారులు తప్పినప్పుడు.. | రావెల పురుషోత్తమ రావు | 66 |
| | | తొలిజల్లు | అశ్వినిశ్రీ | 67 |
| | | అసహజపు చూపులు | గరిమెళ్ళ నారాయణ | 67 |
| | | జిహాదీలకో కొత్త జన్మనివ్వండి | కలశపూడి శ్రీనివాస రావు | 68 |
| | | రెక్కలు తెగిన గులాబి | శైలజా మిత్ర | 70 |
| | | రసరేఖలు | బచ్చోటిశ్రీధర్ | 71 |
| | | | | |
| 2009 | 11 | అమ్మవారి ఆవేదన | లక్ష్మీ రాఘవ | 73 |
| | | ప్రపంచీకరణ | డి కామేశ్వరి | 74 |
| | | శ్రీ శ్రీ | కృష్ణ అక్కులు | 75 |
| | | స్త్రీ | విజయ చావలి | 77 |
| | | దోమ – చీమ | వసుంధర | 78 |
| | | రసరేఖలు | బచ్చోటి శ్రీధర్ | 79 |
| | | | | |

| | | | | |
|---|---|---|---|---|
| 2009 | 12 | చుక్క ఎదురు | చంద్రుపట్ల తిరుపతి రెడ్డి | 80 |
| | | వింత సంస్కృతి (డేటింగ్) | నిడిమామిడి నరసింహ మూర్తి | 81 |
| | | వర్తమానం | ప్రకాష్ మూర్తి | 81 |
| | | శ్రుతి రెండున్నర | బందా శ్రీనివాస రావు | 82 |
| | | ఇంట్రోవర్ట్ అంతరంగం | దేవరకొండ మురళి | 82 |
| | | మరో ప్రపంచం | వసుంధర | 83 |
| | | రసరేఖలు | బచ్చోటి శ్రీధర్ | 84 |

## జీవిత సత్యం

- శ్రీరాం కుమార్ భాగవతుల





మెల్ల మెల్లగా సాగే గాలిలో,
పూల రేకుల గుసగుసలతో,
మంచు ముత్యాలతో,
తొలి సంధ్య చిరు వెలుగులో,
మృదు మధురమైన వీణా శ్రావ్యముతో,
నా గుండె చప్పుడు నాకే తెలియని ఒక కొత్త అనుభూతిని కలిగించినప్పుడు....
ఆ క్షణం నన్ను నేనే మరిచాను... ఆమెనే తలిచాను...

ఆ క్షణము నుంచి...
నాలో ఆమెని వెతికాను
ఆమె మృధు మధురమైన పిలుపుకై పరితపించాను
ప్రతి క్షణం ఆమెనే ఊహించి కలత చెందాను
అప్పుడప్పుడూ బాధని కూడా ఆమెకై అలవాటు చేసుకున్నాను

కాని... "జీవిత" మనే సత్యం నా ముందు ఒక్క క్షణం ప్రస్ఫుటించిన క్షణాన
ఒక్కసారి యదార్ధ జీవితంలోకి తొంగి నన్ను నేను చూసుకున్నాను
ఇప్పుడిప్పుడే మారుతున్న యాంత్రిక జీవనంతో నన్ను నేను పోల్చుకున్నాను
మరుక్షణం నాలోని మార్పుకి ఆహ్వానం పలికించుకున్నాను

అసలు జీవితం అనే నిజాన్ని వెతికినప్పుడు... నాలో నేనే స్పందించుకున్నాను

సాధించటానికి ఆశ ఒక్కటి చాలదని
అడుగేసిన మాత్రమున ఆకాశం అందదని
పలుగు పోటు పడకపోతే పంట చేతికి రాదని
కష్టాలే లేకపోతే జీవితానికి విలువ ఉండదని
ఆచరణే అదృశ్యమైతే ఆశలకి అర్థం లేదని నిజాన్ని గ్రహించుకున్నాను
జీవితమనే సత్యాన్ని తెలుసుకున్నాను....

## పునర్నిర్మాణం - విజయభాను





**మమతానురాగాలు,**
ప్రేమాప్యాయతలు కలబోసి,
పోతపోసి అనుబంధాల కలశం
నిష్కారంగా చేజారింది!
చెల్లా చెదురయిన బంధాల గాజుపెంకుల్ని,
ఒక్కొక్కటిగా ఏరుతున్నాను.
అన్నింటినీ కూర్చి,
తిరిగి ఆ కలశానికి
రూపాన్ని తేవాలని నా అభిలాష
అన్నింటినీ అక్కున చేర్చుకోవాలనే ఆశను
పెంకులు గాయాలపాలు చేస్తున్నాయి
వెచ్చటి కన్నీటితో
కళ్ళను స్నానమాడిస్తున్నాయి
అయినా...
సంకల్పాన్ని బాసటగా చేసుకొని,
గాయాల్ని సహిస్తూనే
కలశ పునర్మిణానికి కృషి చేస్తున్నాను!
కొన్ని బంధాలు అతుక్కోమని మారాం చేస్తే,

కొన్ని విరిగిన ముక్కల అతుకు కుదరవన్నాయి!
కొన్ని, తిరిగి వచ్చి నా మిగిలిన వాటికోసం
బేలగా చూస్తే,
కొన్ని, తమకు లభించిన కొత్త రూపమే చాలన్నాయి
విరిగిపోవడం సహజమే...
తిరిగి ఒక్కటిగా చేరడమే అపురూపం!
అతుకులు కనిపించినా,
అదొక క్రొత్త అందం!
భిన్నత్వంలో ఏకత్వమే ఆదర్శం...
ఇది తెలుసుకునేలా బంధాలను మార్చడమే
నా అభిమతం!

## అమ్మ చిన్నప్పుడు

- తమస్విని, హైదరాబాదు



అమ్మ చిన్నప్పుడు
పార్టీలు లేవుట అమ్మమ్మ సెకండ్ షోలకి వెళ్ళేది కాదట
అమ్మ నాన్న రాత్రుళ్ళు నిద్ర పుచ్చి తాళం వేసుకుని బయటికి పోతే
బాత్‌రూంకి వెళ్ళాల్సొచ్చి మంచినీళ్ళు కావాల్సొచ్చో మెలుకువ వస్తే
ఇంట్లో ఉన్నది తానొక్కడినే అన్న భయం
దాన్ని ఎక్కువ చేసే మంద్రమైన బెడ్‌లైట్ వెలుగు
ఆ నీరవ నిశ్శబ్దంలో కడుపులో కాళ్ళు దాచుకుని వెక్కుతూంటే
బయట అప్పుడప్పుడూ అరుదుగా వినపడే మోటారు శబ్దం
అది తమదైతే బావుండుననే ఆశ..!
దూరమైన శబ్దం.. తిరిగి అంతా నిశ్శబ్దం..
ఆ భయాన్ని జయిస్తూ మగతలాంటి నిద్ర
అమ్మకి తెలియవట!
అమ్మ చిన్నప్పుడు
తనలా ఒక్కటే బిక్కు బిక్కు మంటూ ఉండేదికాదట
వాళ్ళ అక్కలతో అన్నలతో వాళ్ళంతా చేసే అల్లరితో ఇల్లు మార్మోగి పోయేదట

డైనింగ్ టేబుల్ ముందు బిగుసుకు పోయి కూర్చుని
అన్ని మేనర్స్ పాటిస్తూ ఏదో డ్యూటీలా భోజనం చేసేది కాదట
వంటింట్లోకి కింద కూర్చుని పక్కవాళ్ళ కంచంలో
ఆవకాయ ముక్కల్ని దొంగతనం చేస్తూ నచ్చని కూరని వాళ్ళ పళ్ళెంలో వేస్తూ
అన్నం తినడం కూడా ఓ ఆటలా చేసేదట!!
అమ్మ చిన్నప్పుడు
అమ్మమ్మకి తాతయ్యకి సైన్స్ తెలీదుట
మట్టిలో ఆడితే సూక్ష్మక్రిములంటుతాయని
వానలో తడిస్తే జలుబు చేస్తుందని వాళ్ళకి తెలీదట
అమ్మ మామయ్యలతో కలిసి మట్టితో రకరకాల బొమ్మలు చేసేదట
ఇసుకలో పిచ్చుక గూళ్ళు కడుతూ పక్కవాళ్ళవి పడకొడుతూ
అస్తమానూ మట్టిలోనే ఆడేదట
వర్షం వస్తే నాలా కిటికీలోంచి చూసేది కాదట
వానలో తడుస్తూ గిరగిరా తిరుగుతూ వాన వానా వల్లప్ప పాడేదట
కానీ చిత్రం అమ్మకి ఏమీ అయ్యేది కాదట!!
అమ్మ చిన్నప్పుడు
ఏడో తరగతి తప్పిందట
ఎప్పుడైనా నాకు ఫస్ట్ బదులు సెకండ్ రాంక్ వచ్చినప్పటి నాన్నలా
తాతయ్య బెల్ట్ తీయలేదట
'తోట్ల వెంట తిరుగుడు మాని
ఇంటిపట్టున కూర్చుని చదివి ఈసారైనా గట్టెక్కవే అమ్మడూ' అని నవ్వారట!
అమ్మ చిన్నప్పుడు
ఇంకా ఏదో చెప్పబోతోంది మంచంలో పడుకుని ..
పక్కనే కూర్చున్న నా వెన్ను నిమురుతూ అమ్మమ్మ !
'ఫో అమ్మమ్మా ముసలితనపు మరుపుతో నువ్వన్నీ అబద్ధాలు చెపుతున్నావు
అమ్మ బాల్యాన్ని అంతలా ఎంజాయ్ చేస్తే మరి
నన్నెందుకిలా చూపుల శరపంజరంలో పెంచుతోంది?
నుంచుంటే తప్పు కూచుంటే తప్పు, నవ్వితే తప్పు, పరిగెత్తితే తప్పు
అంటూ నా చుట్టూ గిరి గీసి నన్ను మరబొమ్మగా మార్చి
'వెరీ గుడ్' అని ఎందుకు తృప్తిగా నవ్వుకుంటుంది? '

## ఊహానందం

- కోడూరు శ్రీ పాండురంగారావు
మచిలీపట్నం

చీకటి వెలుగులు రెండూ నీవే అయితే
స్వామీ! ఏదైనా నాకొకటే, అయినా
అజ్ఞానాంధకారాన్నుంచి విముక్తి కలిగించు
అంతకు మించిన సౌభాగ్యమేమీ ఒద్దు.



తెలిసినదేమిటో?
తెలియనిదేమిటో?
తెలిసికోవల్సినదేమోటో?
అనేది నీవేనని తెలుసు సుమా.

నీవు నేనే ననుకుంటున్నాను
నిన్నేమి కోరను?
ముందున్నావుగా
నాకు త్రోవ చూపించు చాలు.

చీకటంటే భయమెందుకు
వెలుగుల చిక్కదనమే చీకటి
అని అనుకుంటే అదో తృప్తి

నా హృదయమంతా నీవే నిండిపోతే
మరి నేనెక్కడుండాలి?
మళ్ళీ మరిచాను చూశావా?
నేను నీవే ననుకున్నాను కదూ!

నీటిలో నిశ్చలంగా
తలలు పైకెత్తి తపస్సు చేసే

నీలి కలువలు నిన్ను మరిపిస్తాయి
నన్ను మురిపిస్తాయి

విశాల విహాయసము
గంభీర సాగరము నీవే
కాకుంటే మింటికీ, నీటికి
ఎక్కడిదా నీల వర్ణం

జ్ఞానం, భక్తి చాలు
నిన్ను తెలుసుకోవడానికి
అవే అసలు సిసలైన ప్రేమ
ఆ ప్రేమే నీ ప్రతిరూపం

తలెత్తి ఎప్పుడు చూచినా
నీవే కనిపిస్తావు రంగులు మారుస్తూ
అయితే నల్ల మబ్బల్లాగా, లేదంటే
అదిగో ఆ నీలాకాశం లాగా

రాత్రి తన్ను తాను
కనిపించని నీ కర్పించుకుంది
ఎందుకంటే, నల్లనై నీలాగా
నీలో కలిసి పోవాలనుకుని

నీవు లేని చోటే కనిపించదు
రేయి చీకట్లో సైతం చూడగలను
పిల్ల తెమ్మెరల లాలనలో కూడా
నీ స్పర్శని అనుభవించగలను.

## రసరేఖలు

- బచ్చోటి శ్రీధర్

**మన మనస్సులానందాబ్ధి మునిగినపుడు**

ఎదలొకటియై మనము చర్చించినపుడు
అనుపమోత్సాహమున తిరుగాడినపుడు
కడలి యంచులు కనులార కాంచినపుడు

చేతచేయిని వైచి రాజిల్లినపుడు
నందనోద్యానసీమల నడచినపుడు
మించు సంతోషమున విహరించినపుడు
ఎగసె విహగములై మన యెదలు రెండు

మన మనస్సులు కలతల మునిగినపుడు
కంటి కొలకుల కన్నీరు కారినపుడు
ఆపుకోలేని వెత గుండెలవిసినపుడు
అవిసి బరువెక్కి ప్రాణమ్ములలసినపుడు

కారు చీకట్ల మార్గమ్ము కానపుడు
ఆప్తులెల్లరు కడుదూరమైన యపుడు
విశ్వగమనమ్మదెల్ల స్తంభించినపుడు
పంచుకొంటిమి కన్నీటి వరదలెల్ల

ప్రేమ ప్రాయము మనలను విడచినపుడు
ఆత్మ వేరొక సిద్ధికై యరిగినపుడు
నా కలతలు సంతోషముల్ నావి యగునొ!
నీ కలతలు సంతోషముల్ నీవి యగునొ!

## నేను

పి.వాణి
హైదరాబాదు





చీకటిలో తారను నేను
వెలుగు పంచలేను,
వెలుతురులో నీడను నేను
ఎదుట పడలేను,
ఊపిరిలో సాగే గాలి అలను నేను
చేతికందలేను,
గుండె బరువు తీర్చే కన్నీటిని నేను
గుర్తుపట్టలేవు,
ఎదలయనే నేను వినిపించను
కనుపాపనే నేను కనిపించను
రేకులు వీడిన పుష్పాన్ని నేను
సొగసు పంచలేను,
మూగ బోయిన కోయిల నేను
మనసు తెలుపలేను,
మధురమైన స్వప్నాన్ని నేను
నిజం కాలేను,
వాస్తవంలో ఊహని నేను
అర్థం కాలేను,
వెన్నలలోని చల్లదనాన్ని నేను తాకలేను
కరిగిపోయిన కాలాన్ని నేను తిరిగి రాలేను

## రెండు చేతులు

- రామా చంద్రమౌళి





చేతులు ఎవరివైతేనేమి
అవి పనిచేయడానికే గదా అహర్నిశలూ తపించేది
చేతులు మట్టి పిసుకుతున్నాయా
ఆకుపచ్చ సిరాతో సంతకాలు చేస్తున్నాయా
సుద్దముక్కతో హృదయాలపై అక్షరాలను ప్రతిష్టిస్తున్నాయా
అన్నది కాదు మీమాంస
చేతులెవరివైనా, ఎప్పుడైనా దేన్నో ఒకదాన్ని సృష్టిస్తున్నాయిగదా
-
సముద్రం ఒక చేయైతే అలలు వేళ్ళు, ఆకాశం చేయైతే జ్వాలలు వేళ్ళు
కాళ్ళలోనుండి, కళ్ళలోనుండి, హృదయాన్ని తోడుకుని తోడుకుని
జలలు జలలుగా అందిస్తే గదా
చేతివేళ్ళు తమ కొసల్లో నుండి
ఒక నాగరికతను ఒక దేశాన్ని ఒక సమాజాన్ని ఆవిష్కరించింది

అతని చేతులు భూమిని తవ్వి పాదును తయారు చేస్తాయి
కళ్ళు
మొలకెత్తబోయే పచ్చని మొలకలకోసం ఎదురు చూస్తాయి
అవే కళ్ళు
రేపు విస్తరించి, వికసించి, విప్లవించే పంటలకోసం నిరీక్షిస్తాయి
అతని కళ్ళు చూపులతో
ఒక తరాన్ని పక్షుల గుంపులను పిలుస్తున్న ఆకాశంలా
చేతులు చాచి చాచి పిలిచి
అందరికీ అన్నం పెట్టాలని కలలుకంటాయి

ఆమె చేతులు నాటు వేస్తాయి
కలుపును ఏరుతాయి
మట్టినోటికి అమృత జలధారలనందిస్తాయి

పసిపిల్లలవలె మొక్కలను పొదవి పొదవి
తల్లి కోడి గుడ్లలో నుండి పిల్లలకు జన్మనిచ్చినట్టు
ఆమె
కోట్ల మంది కోసం కోటానుకోట్ల గింజలకు జన్మనిస్తుంది
ఆమె చేతుల స్పర్శతో
ఎందుకో
ఒట్టి బీళ్ళు పచ్చని హరిత ధాన్యసముద్రాలౌతాయి

అక్కడ... ఆ మట్టి ఒడ్డుపై ఆ ఇద్దరూ కూర్చున్నారు
అతడు...ఆమె...మట్టి మనుషులు
ఇద్దరి వెనుక ఏమీ లేదు
ముందూ ఏమీ లేదు, రెండు చేతులు తప్ప
రెండు అన్నం పెట్టే చేతులు
రెండు తలనిమిరే చేతులు !!

## ఏమని నిర్వచించను - విజయ భాస్కర్



తిరిగి రాని గతాన్ని నేనయితే,
మరపు రాని జ్ఞాపకానివి నీవు,

భావ మెరుగని మాటను నేనయితే,
భాష కందని మౌనానివి నీవు,

నేత్రాలు నావే, - చూపు నీది,
హృదయం నాదే, స్పందన నీవు,

వత్తినై మండిపోతూ,



సంబరపడిపోతాను,
- ఆత్మ త్యాగమనీ,....
నన్ను నిల్పిన ఆ నూనెవు నీవు,
వెదజల్లుతున్న ఆ వెలుగువి నీవు,

జ్ఞానానికి బుజువులడుగుతాను, తెలీకే,...
కన్నీళ్ళ కావ్యాలు చదివించి,
కాస్తా నూరిపోస్తావు,
మళ్ళీ మరువకుండా,...

కొంచెం తెలిసి వస్తే చాలు,
"అదిగో నీవు ఇక్కడ...", అంటాను,...
నీటి చుక్క లో నింగిని వెతికినట్టు,....

నన్ను చిన్నబుచ్చక,
ఆ నింగినే నా కనురెప్పల మధ్య బంధిస్తావు,
విశ్వమంతా ఇమిడి ఉన్నా,
నా కాస్త హృదయంలోనూ కొలువు తీరావు,...

నన్ను నడిపిస్తున్నావు,
నడక నేర్పిస్తున్నావు....

నిన్ను ఏమని నిర్వచించను ప్రభూ,
ఏమని నిర్వచించను,.....

ఆకాంక్ష నేనయితే, ఆనందానివి నీవు
ఆలోచన నేనయితే, అనుభూతివి నీవు,
నిన్న - రేపుల లెక్కకు అందని అనుభవానివి నీవు,
అమృతత్త్వానికి నేనిచ్చుకున్న ఆకృతివి నీవు...

## మేఘావృతం

- రాగసుధ వింజమూరి, లండన్





నేనో శ్రావణ మేఘాన్ని
నీవో చల్లని చిరుగాలివి
నీ ముసినవ్వుల ఆహ్వానం లేకపోతే
నాకై నేను తొలకరినై రావటం అసాధ్యం
నిరాశగా నిలకడలేని ప్రయాణం సాగించినా
ఆ దరి అంతా ఎడారిమయం
స్పందించటానికి నా మనసు ఆరాటపడినా
స్పృశించటానికి ఓ చల్లని హస్తం ఉండదు
ఆర్ద్రత కోసం అలమటించే నా అన్వేషణకు
అసలు అంతం అనేదే వర్తించదు
అందుకే నన్ను ప్రతిస్పందించనీయి
ఆప్యాయంగా నన్ను పలకరించు
నాలో దాగి ఉన్న ఉష్ణాన్ని
నీ చల్లదనంతో చెమరించు
నన్ను కరగనీ నీరవనీ

## రసరేఖలు

- బచ్చోటి శ్రీధర్



బ్రతుకు దారిలో కంటకప్రాయములగు
చింతలన్ని మరచి యుసుమంత సుఖము
నరయగలను నీ మృదులచేలాంచలమున
ఒక నిమేషమ్ము తలదాచుకున్న యంత

మనసు పూదోట యందు లేమల్లె పొదల
పరవశమ్మున హాయిగా పవ్వళింతు
చెలియ! నీ యధీనమగు నా చిత్తమందు
నిలచిపోవు నీ పల్కుల తలచుకొనుచు

ఇచట నీవు లేవంచు నేనెరుగలేనా!
సరసనే యున్న నిన్ను నేనరయలేనా!
తేలిపోదు మనఃతరంగాలపైన
ముదమునిచ్చునదీవా! నా హృదయమేనా!

నీ మధురదరహాసముల్ నేర్చినట్టి
నవ్యసుమములు లేజిరునవ్వులొలుక
అలరులన్నింట నీవె యున్నట్లు తోచు
ఇంత యానందమును భరియింతునెట్లు

ఆమని విరిసె నేడు వయ్యారమొలికి
పూల గుండెలు బరువెక్కె పులకలెసగి
వలపు వికసించి నీ పాట పాడుకొనగ
ముదము పెల్లుబికెన్ - గొంతు మూగవోయె

## కాలం తీరు

టి.శ్రీవల్లీ రాధిక
హైదరాబాదు

కాలం
రంగూ రుచీ వాసనా లేని కాలం
జీవితానికి ఎన్ని రంగులద్దగలదు!
ఎన్ని రుచులు వండి వార్చగలదు.!
ఎన్నెన్ని పరిమళాలు అరగదీసి పోయ గలదు!!

కల్మషం లేని బాల్యం
కోటికోర్కెల యవ్వనం
వెలకట్టలేని వృద్ధాప్యం
అన్నీ కాలం తీర్చి దిద్దే కళా రూపాలే

కాలాన్ని మనం
నియంత్రించలేం
కాలం నియత్రించలేని విషయాలని
మనం వూహించనూ లేం

అర్థం లేని ఆవేశాలు
అదుపుచేయలేని మూర్ఖత్వాలు
కాలానికి మాత్రమే వదిలేయాల్సిన
కఠోర పార్శ్వాలు

*టి.శ్రీవల్లి రాధిక గారు హైదరాబాదులో నివసిస్తున్నారు. వీరి రచనలు వివిధ తెలుగు పత్రికలలో, ఆకాశవాణిలో వచ్చాయి. 'రేవు చూడని నావ' అనే కవితా సంపుటి, 'మహార్ణవం', 'ఆలోచన అమృతం' అనే రెండు కథా సంకలనాలు ప్రచురించారు. కొన్ని కథలు హిందీలోకి అనువాదమై 'మిత్ వా' అనే పుస్తకంగా వచ్చాయి. కొన్ని కథలు కన్నడ, తమిళ భాషలలోకి అనువదింపబడ్డాయి. 'నా స్నేహితుడు' అనే కథకి 1994 లో 'కథ' అవార్డు అందుకున్నారు. 'మహార్ణవం' అనే పేరుతో బ్లాగు రాస్తుంటారు.*

మందులేని గాయాలు మండించే వేదనలు
కాలం మాత్రమే సాధించగల కఠిన సమస్యలు

అతి చేదు సంఘటనలని
కాలం కడిగి కడిగి చప్పగా మార్చగలదు
అనుభవసారమనే పాకంలో కలియతిప్పి
తీపి చేయగలదు

అదే కాలం
తీయనివని తోచిన అనుభవాలకి
కనబడని కారాలద్దగలదు
అపార్థాలు, అహంకారాలు జతచేసి
ఘాటు పుట్టించగలదు



అది పంచేంద్రియాలకి అందదు
పరిశోధనలకి లొంగదు
అందనంత దూరంలో ఉండదు
ఆశించినంత దగ్గరగానూ రాదు

కొలవగలిగిన ప్రతిదాన్నీ
గెలవగలమన్న
మన సిద్ధాంతాన్ని
అది వెక్కిరిస్తుంది

విభజించగల వాటన్నింటినీ
పాలించగలమన్న
మన నమ్మకాన్ని
అది వమ్ము చేస్తుంది

అది దుర్గమ కీకారణ్యంలా
అగమ్యంగా ఉండదు

ఆసాంతం అర్థమయినట్లే
అనిపిస్తుంది
ఉత్తుంగ గిరిశిఖరంలా
మనల్ని భయపెట్టదు
అధిగమించసాధ్యంగానే
తోస్తుంది
పుట్టిన క్షణం నుంచీ ప్రతి క్షణమూ
మన చెప్పుచేతల్లో వున్నట్లే కనబడుతుంది
కానీ మనల్ని విడిచిపెడుతోందని
మన కర్థమయే లోపూ
మన చేయిజారి పోతుంది
మన కాలం తీరిపోతుంది..!!

## అందమైన వికృత ముఖచిత్రం

- జ్వలిత
ఖమ్మం

ఇది నా అందమైన వికృత ముఖచిత్రం
ఊరికి దూరంగా కోట బురుజు
ఊరి చివర గోడలు కూలిన పూరిల్లు

ఇంట్లో కూసాలిరిగి కాళ్ళకట్ట జారిన మంచం
పెరట్లో పాడుబడ్డ బావి
వాకిట్లో కొమ్మలిరిగిన జామచెట్టు
సగంలో ఆగిపోయిన ప్రాజెక్టు
ప్రారంభం రోజునే కూలిపోయిన వంతెన
వరదక్కొట్టుకు పోయిన పంటపొలం
గండిపడిన చెరువు

కాల్చడానికి పేర్చిన ఇటుకలబట్టీ
చిన్న చిన్న చేతులతో నిండుతున్న కంకరగుట్ట

అప్పుడే కట్టిన పాఠశాల బోర్డు
అంటుకట్టిన మల్లెపాదు
తుమ్మకొమ్మకు పాతబడ్డ ఉయ్యాల
గుక్కపట్టిన పసిగుడ్డు
పాలు చెమట అట్టకట్టిన రైక

పురుగులేరుతూ ఒంటికాలిపై గుడ్డి కొంగ
ఏంచేస్తుందని ఆరా తీస్తున్న గుడ్లగూబ
కాపలా కాస్తుందని కాకిపిల్ల వత్తాసు
పురుగులకు తిండి పెడుతుందని బాతుపిల్ల సాక్ష్యం
మురిక్కాలవ వైతరిణి చేస్తుందని గద్దపిల్ల సమర్థన
నాకంటె కష్టపడుతుందా? అని కప్ప పిల్ల సందేహం
నేనూ ఒక చెయ్యేస్తా పందికొక్కు ఉత్సాహం



అపరిచిత పొదల్లో పేలిన నాటు తుపాకీ
ఉన్నట్టుండి వులిక్కి పడ్డ నంగనాచి తోడేలు
నీటిలో తేలిన ఈకలు ఏ పిట్టవి?
నీళ్ళ రంగు మార్చినది ఏ నెత్తురు?

చెరువుకు మూలన నిశ్శబ్దంగా
నాలుక చప్పరిస్తున్న తెల్ల నక్కలు
కన్నీళ్ళు నటిస్తున్న మన మొసళ్ళ పక్కనే
ప్రశాంతంగా శాంతిగీతమాలపిస్తున్న
సామూహిక నీరో చక్రవర్తులు

ఇప్పుడు నాకు మెదడు పక్కనే
పిడికెడు గుండె కావాలి..

# శిశిరంలో వసంతం

స్వాతి శ్రీపాద
హైదరాబాదు



మాటలగుండా ప్రవహిస్తూ
నిశ్శబ్ద భావాల్ని సవరిస్తూ
వినువీధి కంటి కొసల్లో
మెరుపుతీగల హొయలు ప్రసరిస్తూ
అంతరంగపు యవనికపై అలల్లా కదిలే చిత్ర విచిత్రాలు

ఏ మూల నుండో ఓ పులకింత
రెక్కలు కట్టుకువాలి
అదృశ్య సందేశాల్ని చూపుల అంచులమీద
మోసుకు వస్తూనే ఉంటుంది



అనుభూతి తొలకరి స్వప్నపు తునక
జీవన సంధ్యాకాశం నిండా
చుక్కల రంగవల్లికల్ని
తీర్చి దిద్దుతూనే ఉంటుంది
అడుగడుగునా మమతల సువాసనల్ని
గుబాళిస్తూనె ఉంటుంది.

సుషుప్తిలో మైమరచిన చైతన్యాన్ని
కొనగోట చెక్కిళ్ళు మీటి అలవోక సౌఖ్యమో అలౌకికమో
అనువదించుకోలేని పారవశ్యపు వాకిలి ముందు
మౌన రాగాల్ని పలవరింతలుగా చెక్కుతూ పోయేవేళ
ఒద్దికగా జీవితం పుటల మధ్య
సస్నేహ వీచికల సౌరభాల్ని
పరిరక్షించుకుంటూనే ఉంటాను
కాలం ఒడిపోతూ వెనక్కు తిరిగి
పరుగెడుతూనే ఉంటుంది.

## నానీలు

పెరుగు రామకృష్ణ
నెల్లూరు





వేసవొస్తే
వెంటాడే జ్ఞాపకం
తాతయ్య తినిపించిన తాటి ముంజెలు

కాగితం పడవలో
అక్షరాలు అలా
మా వాకిట్లోకొచ్చి
కవిత్వాన్ని మోసుకెళ్ళాయి

వేసవి తాపం వోపలేకేమో
పాముల్లాంటి జడల్లో
దాక్కున్నాయి మల్లెలు

## రసరేఖలు

బచ్చోటి శ్రీధర్

పూలరెమ్మల చాటున పొంచి యుండి
నన్ను పరికించు నో మోము కన్నయపుడు
గుండె యుప్పొంగి సందడి నిండె మదిని
ఇచ్చితిని నీకు క్షణములో హృదయమెల్ల

దివ్యతారలు పూల పందిరులు గట్ట
నవ్యశోభల తోడ మండపము నిండ
శత శుభార్థులై యెల్ల రక్షతలు జల్ల
మూడు ముళ్ళను వైచితి ముగ్ధుడగుచు

సంతసమ్మున కనుల బాష్పములు నిండి
ఏదొ యుద్వేగమున యెద యెగసి యెగసి
దివ్యసీమల మనము నర్తించు తరిని
వచ్చె పరదేశ సీమ యాహ్వానమొకటి

ఇంటనడుగిడు సిరిని వారింపలేక
కంట నీరొల్క జూచు నిన్నొంటి జేసి
పయనమైతిని పరదేశ వాసమునకు
ఎడద మాత్రము తాను నీ యెడనె మిగిలె

ఈ విలక్షణ సీమ నాయిల్లు నేడు
అర్థ రహిత మీ యిల్లు యిల్లాలు లేక
ఎపుడు నీ నవ్వు విరియునో యిచట యంచు
గడుపుచుంటి దినములు యుగమ్ములట్లు



## లక్ష్మీం..క్షీర సముద్రరాజ తనయాం..

ఎమ్వీయస్ రామ్ ప్రసాద్
నార్వే

ఎన్నడూ కానమీ
అన్నట్టు జారెమీ
నేటి ఎకానమీ
ఓ లచ్చుమమ్మా!

తరిగె బుల్లిష్ ఘనత
'బేరు' మన్నది జనత
'షాకు' మార్కెట్ చరిత
ఓ లచ్చుమమ్మా!

వలచి వచ్చును సొమ్ము
వొలిచి, మిగుల్చు దుమ్ము
లక్ష్మి చంచలమ్ము
ఓ లచ్చుమమ్మా!

మారు చంద్రుని కళలు

చంద్ర సహోదరి హొయలు

పాల సంద్రపు అలలు

ఓ లచ్చుమమ్మా!

తొలగి చీకటి రేయి

వెలుగు రేకల హాయి

కలుగు సత్యమోయి

ఓ లచ్చుమమ్మా!

కొత్త ఆశల ప్రోది

ఆగామి ఉగాది

శుభకామనే పునాది

ఓ లచ్చుమమ్మా!

## భావాలు

చావలి విజయ

ఆస్ట్రేలియా



కన్నులెర్రనై

భ్రుకుటి ముడిచి

ముక్కుపుటాలదర

కొరకొర చూపులతో

విసవిసనడకలతో

భావావేశ మోము ప్రకటితం చేసేది - కోపం

కన్నులరమోడ్పులై

వాలుజడ వేలాడ

వోపలేని తమకముతో

మిసమిస వన్నెలతో
కొసరు వాలుచూపులతో
భావాభినయ విన్యాసం చూపేది - తాపం



కన్నులు ప్రజ్వరిల్లగా
క్రోధావేశం ప్రస్ఫుటితమౌతూ
వణుకుతూ మంత్రోచ్చారణ సల్పుతూ
జారిపోయిన వివేకముతో
అదుపుతప్పిన అహంకారముతో
భావోద్రేకం ప్రస్ఫురించేది - శాపం

కనులు మూసి
ప్రశాంత నగవుతో
మౌన ముద్రలో ధ్యానిస్తూ
పరిశుద్ధ మనముతో
పరిసరాల మమేకముతో
భావనామాత్ర జగత్తులో విహరించేది - జపం

కనులల్లాడుతూ
చిలిపినవ్వుని ప్రదర్శిస్తూ
మనఃస్థితిని నెమ్మదిపరుస్తూ
కదిలే కన్నులలో
అల్లరిచూపులతో
భావప్రకటనా దృశ్యాన్ని మాయం చేసే యత్నం - నెపం!

***

## తమసోమా జ్యోతిర్గమయ

హేమ వెంపటి

తమస్సు క్రమ్ముతోందని మనస్సును
చెదరనీకు సుమ్మి నేస్తం!
కాలంతో కలబడుతూనే నువ్వు
కదలిపో మునుముందుకి శీఘ్రం!
వేకువ వచ్చే జాడకోసమై
వెతికిచూడు ఇంకొంతసేపు మిత్రమా!
వేకువ రాక చూసి వికసించాలని
వేచిచూడవా సుమ ప్రసవాలు?
చీకటి శాశ్వతం కాదు ఇలలో
వెన్నంటే వుంటుంది వెలుగు కూడా
కాలచక్రపు ఇరుసు ఎపుడూ
కదలకుండా నిలిచిపోదు కదా!
గమ్యమేదో తెలియకున్నా
గడచిపోవా దివారాత్రాలు!
రాత్రి గడవగానే వస్తుంది పవలు
పవలు ముగిసాక రాత్రి రాక సహజం,
అనంతమౌ కాల గమనంలో
ఆగక సాగే పయనమిది!
నిరంతరం క్రిందుమీదౌతూ
నిత్యం కదిలే కదిలే చక్రగమనం!
ఓరిమితో వేచిఉంటివా త్వరలో
వస్తుందిలే వెలుగు జిలుగు నీకై
ఆశ వదలక సాగు ముందుకు
"తమసోమా జ్యోతిర్గమయ"!



## చివరి మజిలీలో కలిసిన స్నేహమా!

మిరియాల శ్రీ సత్య భ్రమరార్జున ఫణి ప్రదీప్

గదిలోపల నేను, గది బయట ఆమె

నాకు తెలుసు తను నాకోసమే వచ్చిందని,
కానీ ఎందుకో గుమ్మం బయటే ఆగింది
ఈ సారైనా నేనే తనని పలకరిస్తానన్న ఆశేమో!

నాకు ఆమెను పలకరించాలని ఉన్నా
మనసులో ఎక్కడో వద్దనే అనిపిస్తోంది



నాకు -
తనంటే కోపమా? ఏమో, తను కనిపిస్తే సర్వం మరచి గాలిలో తేలతాననేమో
తనంటే భయమా? ఏమో ఈ సమాజం దృష్టిలో ఇక నేనుండననే భయమేమో
తనంటే అభిమానమా? ఏమో , నా కష్టాలన్నీ దూరం చేస్తుందనేమో

మాది జన్మజన్మల అనుబంధమైనా
ఆమెతో నాకెప్పుడూ తొలిపరిచయమే

ఎవరామె, నా అర్ధాంగి కాదు
నా ప్రేయసి కాదు
ఆమె లేకుండా నా జీవితం పూర్తికాదు

నా దేహపు చివరి మజిలీలో కలవబోతున్న స్నేహమామె
నా అనంత జీవనయాత్రలో మరో మజిలీకి శ్రీకారమామె!
(తుదిక్షణాల్లో చేరువయ్యే మృత్యుదేవతని వర్ణించే ప్రయత్నం)

## ఆ వైపే

డా.చిల్లర భవానీ దేవి
హైదరాబాదు



ఈ మట్టి మత్తుగా ఆకర్షిస్తుంది
సుతిమెత్తని మాటలా!
ఈ సముద్రం ఆకర్షణీయంగా కట్టి పడేస్తుంది
దృశ్యాన్ని వరించిన కనుపాపలా!
ఈ గాలి మురళీగానంలా సోకుతుంది
మమకారం నిండిన స్పర్శలా!
ఈ ఆకాశం నిలువునా కమ్మేస్తుంది
ఆవరించిన పొగమంచు రూపంలా!
ఈ దాహాగ్ని రగుల్తుంది
అనుక్షణం జ్వలించే వేదనలా!
పంచభూతాలు దాచుకున్న నేను
మళ్ళీ మళ్ళీ ఆ వైపే తిరిగి చూస్తున్నాను
గమ్యాన్ని అన్వేషిస్తూ !
ఆ వైపే నడుస్తూ !!

## వసంతం

డా.గోపాల్ నేమాన

చెవిలోన బ్లూటూతు
చేతిలో బ్లాక్ బెర్రీ
ఎదురుగుండా టి.వి.
ఒడిలోన లేప్ టాపు
పక్క టేబిల్ పైన కోకు
మధ్య తట్టి, తట్టి అరుస్తున్న కొడుకు

సడన్ గా గుర్తుకొచ్చాడు నాకు
ఒక అష్టావధాని
కాదు సాఫ్టువేరు ఇంజినీరు 'నానీ'!

ఊళ్ళో అంతా ఇంతా కాదు పరపతి
ఇండియా వెళ్ళినప్పుడల్లా వెళ్తాడు సైడ్ ట్రిప్ తిరుపతి
ఇంటినిండా ఇండియా మెమరబీలియాలు
దేవాలయాలలో నేమి, పార్టీలలోనేమి
పట్టు చీరెల పెరేడులేమి, పట్టపగలులా
వెలుగు నగల ధగధగలేమి
వాని దన్నుతోని పూజారి పైలట్టాయె
దేవుని దర్శనంబే సులువు, పూజారి గగనమాయె

పక్క వ్యాపారాలేమి, వ్యాసంగాలేమి
వేసంగి చోటులేమి, వెలితిలేని బతుకేమి
వ్రతాలు,హోమాలకి కొదవేమి
బాబాలు, స్వాములార్ల పాదాభివందనాలేమి
వాని నిర్వాహ దక్షతలకు అభివందనాలేమి

వచ్చెనపుడొక ఆర్థిక సునామి
దానితో సర్వమ్ము తుడిచిపెట్టుకుపోయె
ఇల్లువాకిలి సర్వమ్ము బాంకు పాలాయె
ఏమి లాభము శతకోటి రామనామ జపము
చేయుమయ నిత్యము 'ఓ బామ" జపము
దక్షహోమము విధ్వంసమాయె
లెమ్ము భస్మరాశి నుంచి ఫీనిక్సులాగ

తిరిగి బతుకునెట్లు సాధింతువయ్య
కలలుగన్న ప్రవాసాంధ్ర దొరబాబు కదయ్య
మాతృభూమి నిన్ను మరల రమ్మనియె
నీ తల్లి నిన్నెపుడు ఒడిలోన నుంచి
నీ శిరమ్ము నిమురు వాత్సల్యమ్ముతోను

బ్రతుకునేర్పు గుణపాఠమెంత విలువ?
సాగు ముందు దాని సంతరించుకొనుచు
అదిగో..! నూతన వసంతము ఆసన్నమాయె
ప్రకృతి లేలేత చిగురు తొడుగుకొనియె
పూలగుత్తులు వికసించు త్వరలోనే ముదముగూర్ప
ప్రకృతి పరమాత్మ రెండు ఒక్కటేయన్న
నిత్య సత్యము మదిలోన నిలుపుకొనుము..!

## రసరేఖలు

బచ్చోటి శ్రీధర్

అంతు తెలియని చింతతో అచట నీవు
ఎదురు తెన్నులు చూచుచునిచటనేను
ఎన్ని దినములనిట్లు లెక్కింపవలెనో!
ఎంత కాలమీ యెద బరువెక్కవలెనో!

ఎన్ని హిమ సుమంబుల పరికింపవలెనో!
ఎన్ని వర్షబిందువుల లెక్కింపవలెనో!
ఎన్ని ఉదయ సంధ్యల తిలకింపవలెనో!
ఎన్ని నక్షత్ర రాశులనెన్నవలెనో!

కన్నులందున యుందువు కనను నిన్ను
ఇంట తిరుగాడుచున్న నిన్నెరుగలేను
ఇంత చేరువలో గూడ నెంత యెడమొ!
ఇంత యెడబాటులో సాన్నిహిత్యమెంతొ!

ఈ మతి భ్రమణ మది యింకెన్ని నాళ్ళొ!
ఈ రహస్యబాష్పమ్ము లింకెన్ని నాళ్ళొ!
ఈ విగతజీవనమ్మదికింకెన్ని నాళ్ళొ!
ఇచటకీ వరుదెంచకింకెన్ని నాళ్ళొ!

హృదయమెల్లను నీ కడ వదలి వైచి
శూన్య దేహంబుతోనిట సొక్కుచుంటి
కనులకందని దూరముల్ కరగునెపుడు?
దరికి చేరెడు మార్గమ్మునరయుటెపుడు?



## ఓటెవ్వరికి?

విజయశ్రీ నాదెళ్ళ

**నాకు** తెలిసి మంచి చెడు రెండే అనుకున్నా లోకంలో..
ఎప్పుడైనా రెండింటిలో ఒకటి ఎన్నుకోవచ్చనుకున్నా ..
కానీ, ఏ పార్టీ కరపత్రం చూసినా నాకు కనిపించేవి
హింసా రాజకీయాలు, పదవీ వ్యామోహాలు
ఒకరిని మించి ఒకరు నిలబెట్టుకోలేని వాగ్దానాలు
పరస్పర దూషణలో దుర్భాషలు
ఒకరి దుర్మార్గాన్ని ఇంకొకరు బయటపెట్టడాలు
దొరికినంతా దోచి స్విస్ బాంకులో దాచటాలు
పేదవాడి ఓటు కోసం దీనంగా పడిగాపులు -
ఎవరో అన్నట్టు..
నేతలంతా రాత్రి బారు, పగలు దర్బారు ..!
ఇందుకేనా పరపీడన పరాయణత్వం వదిలించుకున్నదని
వీళ్ళచేతుల్లోనా నా జన్మభూమి ఉన్నదని
నిశ్చేష్టనై నిలుచుని చూస్తున్నా
ఓటెవ్వరికని ఆలోచిస్తున్నా..!

## ధర జొన్నలగడ్డ ఆశాకిరణ్

**ఇది** చాలా మహత్తైనది
..తక్కువగా ఉన్నప్పుడు
కొనే అవకాశమివ్వదు
..ఎక్కువగా ఉన్నప్పుడు
కొనాలన్న ఉత్సాహానివ్వదు

ఇది చాలా గమ్మత్తైనది
..నన్ను విడవనంటూ నాతో పాటు
తరుముతూ ఉంటుంది
..ఆర్థిక స్థితిని సమతుల్యం చేస్తూ
నన్నెపుడూ మధ్య తరగతిలోనే ఉంచుతుంది..!

ఇది చాలా నిఖార్సైనది
ఇచ్చి పుచ్చుకునే బహుమతులకు కొలబద్ద
అమ్ముకునే ఒడంబడికలకు
సరిహద్దు..!

## ఆశ(యం) కోడూరు శ్రీవెంకటేశ్వర స్వామి
హైదరాబాదు



**నీ కాటుక** కన్నుల నే చూస్తూనే ఉంటా
నీ చూపుల జాజులు వికసించాలనుకుంటా
నీ అరచేతుల గోరింటతో పద్మాలే అవునంటా
నీ మనసును మంచికెపుడూ అద్దంలా కనుగొంటా

నీ నవ్వుగ నను ప్రేమించే మనసొక్కటి నీదంట
నీ మనసుని  నా మనసుకి తోడుగ అనుకుంటా
నీ మనసున భావుకతగ పురివిప్పాలనుకుంటా
నే వలపు వాహిని నా ఎద సంద్రంలో కలవాలనుకుంటా

నీ మౌనంతో నా మనసుని కట్టేస్తావెందుకంట
నీ మాటల ముత్యాలనే తలంబ్రాలుగ కోరుకుంట
నీ పెదవి చాటు చిరునవ్వులు హృదయంతో ఏరుకుంట
నీ లతాంతపు మనసుకెపుడు ఆసామిగ నేనుంట..

నీ పెదవుల దరహాసం కలకాలం కోరుకుంటా
నీ చెక్కిట ఎరుపు చూసి సందెకాంతులు అనుకుంటా
నీ పాదపు మువ్వలెపుడు రవళించాలనుకుంటా
నీ ఊహల ఊయలలూగు నా కల చెదరొద్దనుకుంటా..!

## నిన్నలో నేడు - నేటిలో రేపు

అశ్వినిశ్రీ



**నిన్నలో** నేడు నాకెంతో తీయన
ఇరవైలో - ఇరవైన కల కదా అది!
అందుకే అది అమోఘం!
ఆద్యంతం ఆశాజనకమై
సమ్మోహనంగా
నా ఆత్మ గౌరవపు బావుటాని ఆకాశం వైపు తిప్పి
పొద్దుటి వేళ పొద్దు తిరుగుడు పూవై నిలిచింది!
నేటిలో రేపు నాకెంతో వేదన,
నలభైలో - నాలుక బయటపెట్టి భయపెట్టే రాకాసి కదా ఇది!
అది ఎప్పుడూ దిగ్భ్రాంతే..
ఆద్యంతమూ అయోమయమై అలజడి రేపుతూ
ఎక్కడో, ఎప్పుడో ముగింపుకొచ్చే కథే అని గుర్తు చేస్తూ

విధాత చేతిలో నేనూ ఓ పావునే అని దెప్పి పొడుస్తూ
మధ్యాహ్నపు సమయాన అటా..ఇటా అన్న సందిగ్ధంలో ఉన్న పొద్దు తిరుగుడై నిల్చింది!
అందుకే నేను నిన్నలో రేపై నిల్చిన నేటిని నెమరేసుకుంటాను..
నేడు మాత్రం రేపటిని గురించి ఆలోచించను
నేటిని జ్ఞరేస్తూ, నిన్నా ఇలాగే కదూ అనుకుంటాను..
ఎంతైనా ..నలభైలో పడ్డాక,
గతకాలమే మేలు వచ్చు దాని కంటెన్!

## ప్రేమ

మధుకుమార్ నేదునూరి



**నువ్వు** ప్రేమించే వాళ్ళు
నిన్ను ప్రేమించాలనుకోవడం కాదా స్వార్థం?!
నిన్ను ప్రేమించే వాళ్ళకి
నువ్వు దూరమవ్వాలనుకోవడం కాదు పరమార్థం!
కక్షలు కార్పణ్యాలు పెంచుకుని
కడ తేరకు / తేర్చకు,
కాదు ఇది స్వార్థ భరిత సంగ్రామం
ప్రేమ అనురాగాలు పంచుకుని
జత చేరు / చేర్చు
కావాలి ఇది స్వార్థ రహిత సంగమం!
ప్రేమని నువ్వు గెల్చుకో
గెలవడానికి నిన్ను నువ్వు మలుచుకో..!

## రసరేఖలు

బచ్చోటిశ్రీధరరావు

**గతము** గతము కాదెన్నడు కరిగిపోదు
తొలగిపోవదు స్మృతిలోన నిలిచియుండు
నిలిచి యున్నట్టి క్షణములు నిత్యమౌను
నిత్యమై గూర్చు బ్రతుకున నిండుదనము

గతము సతతము కన్నుల గట్టుచుండు
మనసు పూదోట విడి తాను మరలిపోదు
మరలిపోయినంతలో తిరిగివచ్చు
తీయనౌ జ్ఞాపకమ్ముల తిరిగి యిచ్చు

కలసినది నిన్ను తొలిసారి గతమునందు
కలసి తిరుగాడినది గూడ గతమునందె
మనసులానంద జలధి మున్గునది నేడు
కొత్తదారుల మనము సాగునది రేపు

వచ్చుకాలము సంశయాస్పదము కాదు
మనము నిర్మించుకొను భావి మార్గమద్ది
చేసికొన్నచో నానందసీమ మనది
వదలు కొన్నచో శూన్యజీవనము మనది

గతము కలదు భవిష్యత్తు కలదు - రెండు
నడుమ కలసెడు వర్తమానమ్ము కలదు
ఈ త్రికాల స్థిరత్వమ్మునెరిగినంత
చేరు మనలను సంపూర్ణ జీవనమ్ము

# మాయావి

కల్పనా రెంటాల

వంగూరి ఫౌండేషన్ నిర్వహించిన 14వ ఉగాది ఉత్తమ రచనల పోటీలో బహుమతి పొందిన కవిత

వెళ్ళొస్తానంటూ
నీకు హగ్గులిచ్చి బైబైలు చెప్పి
మసక మసకగా కంపిస్తున్న మబ్బులపై నుంచీ
కలల శ్వేత సౌధాల్లోకి వెళ్ళిపోయాక

అంతా ప్రశాంతం
అక్కడా ఇక్కడా అంతా క్షేమం

దోసిటపట్టిన నాలుగు చినుకులు
ఆత్మీయంగా కౌగలించుకున్న నీరెండలూ
నదీనదాలు, పచ్చని పంటపొలాలు
చెమ్మచెక్కలు, అష్టాచెమ్మలు
అన్నీ మెలమెల్లగా
కంటిపాపల్లోంచి, చూపుల ఫ్రేముల్లోంచి
ఓ తెరచాప వెనక్కు క్రమంగా కనుమరుగు

వాన పడుతుందా
ఏరు నిండుతుందా
చేను పండుతుందా

ఇది కదా నిన్నటి దుఃఖం

యుగయుగాల విరహభారంతో
నే తిరిగొచ్చి నీ ముంగిట నిలబడితే
ఏముందక్కడ?

తెల్లని ముగ్గు, ఎర్రని కుంకుమ దిద్దుకున్న పసుపు గడపలేవి?
అగరుపొగల, స్వరార్చనల పరిమళాలేవి?
అమ్మ అరుపుల, నాన్నారికోపాలేవి?
గోధూళి వేళ మువ్వలగంటల పరుగులేవి?

చెరువులన్నీ రొయ్యలకు మేత కాగా
చేలన్నీ పురుగుమందులకు హారం కాగా
ఒకనాటి నా సస్యశ్యామల ధాత్రి
ఇవాళ నరకానికి వాకిలి

- అయినా అంతా ప్రశాంతం
ఇక్కడా, అక్కడా అంతా క్షేమం

పాడు బడ్డ వూరు
బీడుపడ్డ చేలు
దీపమారిన గర్భగుడి
వూరునీ, వాడనీ కమ్మేసిన
నగల నగర జలతారు వస్త్రం
రీమిక్సుల సంగీతం హోరు నా సరిగమల్ని మింగేసింది
నా పావడాని ఓ స్కర్టేదో దాచేసింది
నా మండువా లోగిలి నిండా
తలకిందులుగా వ్రేలాడుతున్న గబ్బిలాలు

నెమలికన్నుల కలవరింతలు
కాగితప్పడవల కేరింతలు

అమ్మమ్మ చెప్పిన రాకుమారుడి కథలు
తాతయ్య చూపించిన నక్షత్రాల వెలుగులు
ఏవి? ఏమయ్యాయి?
ఎవరీ పోకేమాన్లు? పవర్ రేంజర్లు?

బొమ్మల పెళ్ళిళ్ళన్నీ బార్బీ బొమ్మలైతే
క్రికెట్ బిళ్ళలన్నీ కంప్యూటర్లు దాచేస్తే
ఇసుకగూళ్ళన్నీ వీడియో గేములైతే
పలకరింతలన్నీ రింగ్ టోనులై
ముత్యాల్లాంటి అక్షరాల్ని కీబోర్డులు మింగేస్తే
నే రాసుకున్న వుత్తరాలేవి?
యెస్సెమ్మెస్సుల్లతో నిండిపోయిన నా ఇన్‌బాక్స్ తప్ప!

- అయినా అంతా ప్రశాంతం
ఇక్కడా, అక్కడా అంతా క్షేమం

ఇప్పుడు కళ్ళున్నాయి
కళ్ళున్న గుండెలే ఎక్కడో రాలిపోయాయి
ఇప్పుడు చూపులున్నాయి
మనసుని తాకే లోచూపులు తప్ప
ఇప్పుడు చెవులున్నాయి
చెవులున్న గుండెలే ఎక్కడో చెదిరిపోయాయి

ఇప్పుడవన్నీ శిథిల సంకేతాలే
మబ్బుల్లోంచి విమానాల్లోకి ఎగిరిపోతున్న వసంతాలే

దేన్నయినా కొనవచ్చనీ,
దేన్నయినా అమ్మవచ్చనీ
ఏదైనా సంతలో దొరికేదే అనీ
చెప్పేస్తున్న, చెప్పిస్తున్న
మాయావి ఇక్కడే మన మధ్యలోనే ఉంది!

మనల్ని నడిచే రూపాయల్లాగా, డాలర్ల చిలకల్లాగా
మన మాటల్ని బంగారపు మూటల్లాగా
మన రాత్రుల్ని కాల్ సెంటర్లలాగా
మొత్తంగా మనల్ని మనలాగా కాక
అచ్చుగుద్ది నట్టు తనలాగే మార్చేస్తున్న
మాయల ఫకీరు నుండి పారిపోవాలనుంది

ఎటు పరుగెత్తాలో ఎవరైనా దారి చూపిస్తారా?
ఎలా పారిపోవాలో ఎవరైనా నేర్పిస్తారా?

# రెండు జళ్ళ సీత - మూడు ముళ్ళ రాధ వేద

వంగూరి ఫౌండేషన్ నిర్వహించిన 14వ ఉగాది ఉత్తమ రచనల పోటీలో బహుమతి పొందిన కవిత

**అప్పుడేమో:**
అమ్మాయి కనబడకుంటే
గుండెలోన గుబులు యెందుకో..
చెప్పలేని దిగులు యెందుకో?!
అమ్మాయి కనబడితే
గుండె క్షణం ఆగుటెందుకో..
ఉరకలేసి పరుగులెందుకో?!
అమ్మాయి నవ్వితే..?
హాయ్, అమ్మాయి నవ్వితే..
మనసులోన మెరుపులెందుకో..
మరువలేని తలపులెందుకో?!
అమ్మాయి కలలోకొస్తే..?
ఆ అమ్మాయి కలలోకొస్తే
బాపు కుంచెగీతగమారి..
రెండు జెళ్ళ సీతగమారి..
గుండెలోన కోత యెందుకో?!

**మరి యిప్పుడు:**

ఇల్లాలు కనబడకుంటే...
ఇల్లు తెల్లబోవునెందుకో..
కాలమసలు ఆగునెందుకో..?!
ఇల్లాలు కనబడుతుంటే..
బ్రతుకు గాడి తప్పదెందుకో..
నియంతలో మధురిమెందుకో?!
ఇల్లాలు నవ్వితే..?
హాయ్, ఇల్లాలు నవ్వితే..
విరుల విల్లు తాకునెందుకో..
పూల జల్లు కురియునెందుకో..?!
ఇల్లాలు కలలోకొస్తే..?
నీ యిల్లాలు కలలో కొస్తే..
మూడుముళ్ళ రాధగ మారి...
"రమణీయపు" గాధగ మారి..
గుండె నిండి తొణుకునెందుకో?!

## ఓ సంధ్య

డా. సురేంద్ర కె.దారా

వంగూరి ఫౌండేషన్ నిర్వహించిన 14వ ఉగాది ఉత్తమ రచనల పోటీలో ప్రశంసాపత్రం పొందిన కవిత

**ఆకాశం అంతా మబ్బుపట్టి ఉంది**
ఆ వాతావరణంలోనే ఆ ఇంటి వెనుకగా
క్రింద వాలులోకి జారిపోయే పచ్చిక బయలూ
దాని వెనుక నల్లని రహదారీ
దారి కిరువైపులా చెట్ల వరుసలూ
దారి కవతల మళ్ళీ పచ్చికతో ఉన్న మెరక ప్రదేశం
ఆ వెనుకగా చెట్లూ, కొండలూ
కొండల చివరన ప్రకృతి అందాలను అనుభవిస్తూ
వంపులను స్పృశిస్తూ, తెల్లని మబ్బులు పైటచెంగులా పరచుకున్నాయి

ఈ దృశ్యం ఇలాగే ఉంటే అది ఏ చిత్రకారుడి సృష్టో అనుకుంటామని,
తనకు గుర్తింపు ఉండదని అనుమానపడిన దేముడు,
తన సృష్టిలోని సహజత్వాన్ని చూపడంకోసం
నేపథ్య సంగీతాన్ని కూర్చమంటూ పక్షులను కూడా పంపాడు
ఈ రోజు నువ్వు పూర్తిగా విశ్రాంతి తీసుకో అని సూర్యుడికి శెలవునిస్తూ
విశ్వాన్ని కాపలా కాసే బాధ్యతని మేఘాలు తమ మీద వేసుకున్నా,
తన పెద్దచెల్లెలు భూదేవినీ, చిన్నచెల్లెలు ప్రకృతినీ
ఒక్కసారైనా చూడకుండా ఉండలేని సూర్యుడు,
మేఘరాజుకి చెప్పి సహోదరిలను తృప్తిగా చూసుకుని
పశ్చిమవీధిన ఉన్న తన నివాసానికి పయనమయ్యాడు
పెద్దన్న తమపై చూపిన వాత్సల్యానికి (నీరెండకి)
పులకరించిన సహోదరిలను చూసి వాయుదేవుడు తృప్తిగా నవ్వుతూ
చిన్నన్న చంద్రుడిని పిలవడానికి తూరుపు వీధివైపుకి సాగిపోయాడు..

## ఎదురు చూపు

వింజమూరి రాగసుధ
లండన్

**ఎదురుచూపు ఎదురుచూపు**
ఆదినుండి తుది వరకు
ఎదురు చూపు ఎదురుచూపు
సూర్యుడి కోసం తామరలు
చంద్రుడికోసం చెంగల్వలు
ఎదురుచూపు ఎదురుచూపు..
తొలకరికోసం పూలమొక్కలు
చినుకులకోసం ముత్యపు చిప్పలు
ఎదురుచూపు ఎదురు చూపు
ఆమని కోసం కోయిలలు
పున్నమి కోసం ప్రేమికులు
ఎదురు చూపు ఎదురు చూపు
నీవులేకపోయినా నీ భావనని ఆరాధిస్తూ
నీవు చేతికందకపోయినా 'నీవు అందించే చేయికోసం నేనూ...
ఎదురుచూపు..ఎదురుచూపు..

# నువ్వు నేను

తమస్విని
హైదరాబాదు

అస్పష్టమైన స్వప్నం అప్రయత్నంగా
ఉలిక్కి పడేలా చేసినప్పుడు
నా పక్కన నువ్వుంటే బావుండనిపిస్తుంది

ప్రాతః కాలాన మెత్తటి పచ్చికమీద నడుస్తూన్నప్పుడు
కాలి తాకిడికి తలవాల్చిన గడ్డిపువ్వును
సుతారంగా ఓదార్చేప్పుడు
నా పక్కన నువ్వుంటే బావుండనిపిస్తుంది

ప్రపంచమంతా ఆదమరచి నిదురించే
హేమంత రాత్రులలో నీ చిరువెచ్చని స్పర్శ
నాకు కావాలనిపిస్తుంది

చినుకులని నోటితో అందుకోవాలని
తల ఎత్తి నువ్వు చూస్తున్నప్పుడు నీ
కనురెప్పలపై చిందిన తుషార బిందువును
తమకంగా ముద్దు పెట్టుకోవాలనిపిస్తుంది..!

నీ చేతిలో చేయివేసి మౌనంగా నడుస్తూ
ఈ జీవితపు అంచులను దాటి వెళ్ళాలనిపిస్తుంది.

# రసరేఖలు

బచ్చోటి శ్రీధర్

ప్రేమ వెన్నెలయై ప్రసరించునెచట?
ప్రేమ సూర్యాంశువై ప్రభవించునెచట?
ప్రేమ బహుదళ పద్మమై విచ్చునెచట??
ప్రేమ వెలుగొందు సుఖము లోపించు చోట

వ్యథలు గలచోట ప్రేమను పంచగలము
దీనజనులున్న ప్రేమ చిందించగలము
పేదరికమున్న చోటుల ప్రేమ వలయు
వెడలెదము రమ్ము వెతలను వెదకికొనుచు

మనమిరువురము చరియించు మార్గమందు
సంతసమ్మును సంతృప్తి శాంతి తప్ప
కలతలు కడగండ్లు వెతలు కానరావు
వ్యథలు లేకున్న ప్రేమను పంచుటెట్లు?

చెలియ యిటురమ్ము ఆనందసీమ వదలి
వెదకికొందుము కన్నీటి వీటి కొరకు
జాలువారెడు పేదబాష్పముల తుడిచి
వెడలిపోదుము మరికొన్ని వెతలకొరకు

ఈ విచిత్రమేమంచు ప్రశ్నింతువేమొ
దైవమును జేర దీనులే త్రోవ యంద్రు
వెతలు లేనట్టి సీమ ప్రాప్తించునెడల
వ్యథలనార్చుట యెట్లు? కైవల్యమెట్లు?
అంచునరుదైన బాటలోనరుగుచుంటి
చెళ్ళున చరిచి చీకటి చీల్చెనెవరొ
దైన్యమన్నది కనరాని ధరణి యున్న
దైవకృపకదికాదె నిదర్శనమ్ము?

***

## ప్రయాణం

విజయభాను



ఎవరో ఒంటరిగా విడిచి పెట్టిన వాగులా
బండరాళ్ళపై నుండి దొర్లుతూ
మెత్తటి నురగను పుట్టిస్తూ
అలసట అనిపించినా, బడలికగా వున్నా
ఏకాంతాన్ని ఆస్వాదిస్తూ
ఒక్కోసారి బిగ్గరగా రోదిస్తూ
సాగిపోతున్నా నేను..!
నా కలల సాగరాన్ని చేరడానికి
దారిపొడవునా అవాంతరాలతో పోరాడుతూనే ఉన్నా..
నా ప్రయాణం సాగుతోంది..
అపాయకరమైన దారుల్లో సాహసాలుగా..
పూలదొంతరల తోటల్లో కమ్మని గాలిగా!
ముళ్ళదారుల్లో సైనిక కవాతుగా
కాకులు దూరని కారడవుల్లోసైతం కన్నీటి ఏరుగా
విశ్రాంతికోసం యత్నించని ఆత్మ నాది!
కడలి కెరటాల కౌగిలి చేరే వరకూ
పట్టుసడలని ఆత్మవిశ్వాసం నాది..! ***

## మానవుడు

ఆనంద్ సూరంపూడి

మత్తు వదలరా..నిద్దుర మత్తువదలరా
అలల నదిలో పరవళ్ళ నాట్యం చూసావటరా!?
మౌనగీతాల గలగలల చప్పుడు విన్నావా సోదరా!?
కలల జీవితం నేర్పించే పాఠం  నది చెప్పినదే కదరా
పరవళ్ళు తొక్కే శలూ, ఆలోచనలన్నీ మరి నీవేరా!
చూపు తిప్పరా, ఇక నీ గురిని మార్చరా
నది పక్కన దాగున్న నీటిగుంటను చూడవేమిరా
అందులో గీతమెక్కడ మరి  నాట్యమెక్కడరా?
నీ బ్రతుకు నావ దాని గొంతులో సరిపడనే లేదురా
సరిపోయినా నీకు లోకాల అందాలను చూపించను రాదురా
కళ్ళు తెరవరా, నీ మనసుకూ  నేత్రముందిరా
ఈ జీవితపు ఊపిరి శాశ్వతమ్మని ఎవరు చెప్పారురా?
ఆకులు రాలిన చెట్టు ఎదురు చూసేది ఎవరికోసమురా?
వసంతమొచ్చిన వేళన కోకిలమ్మకు నీ పిలుపనవసరమురా
వసంతమెళ్ళిన రోజు తిరిగి ఎదురుచూపు మామూలే లేరా..
నడక వదలరా, కెరటాల పరుగు త్రోవన ఉరికి చూడరా
ఏది ఆచారము, మరేది సాంప్రదాయమ్మురా?
నీ గుండె నమ్మినదాన్ని మించిన భగవద్గీత ఏదిరా?
బ్రహ్మకాలములో నీ బ్రతుకు క్షణభంగురమేలేరా
నీదే కాని జీవితంలో నీదియంటూ లేనేలేదు వినరా..
నిస్సత్తువ విడువరా, శుభోదయమ్ము గాంచరా
చీకటిలో నిద్ర నీ మెదడు శక్తినేమి చేసిందో చూసావటరా?
తృప్తి అనే క్షుద్రమాంత్రికుడి చేతిలో ఉందని తెలియలేదురా?
నీ అనుమతి లేనిదే నీ శక్తిని దోచే దమ్ము ఎవరికుందనిరా..
అగిజ్వాలల శక్తినీది..పోయి మాంత్రికుడిని దహించి రారా..

జయమ్ము నీదిరా, నీకిక భయమ్ము లేదురా
జంకు గొంకులేక ముందు సాగిపొమ్మురా
పరవళ్ళ ఉధృతిని ఆపే గోడను కట్టగలిగిన దెవడురా?
నీ మనసు ఉరుకును అడ్డుకునే గుండె ఎవడికుందిరా?
ఈ జీవితం కేవలం చిలకజోశ్యాల సాంఘికమ్ము కాదురా
ఊపిరిని వదలినా, నీ పేరును శాశ్వతమ్ము చేయరా
నిశీధిలోని మనుగడకు స్వస్తి చెప్పి కదలరా
దిగంతాలు అనంతాలు నిన్నే స్మరియించెనురా
నదీ ప్రవాహమే నీ మనోనేత్రమ్మునకిక స్ఫూర్తిరా
నీ అస్థిత్వం గురుతులు ప్రపంచానికి బహుమతిగా ఇవ్వరా
ఈ మనిషి లేని విశ్వమ్మిక మనలేదని చూపరా
ధన్య జీవుడవురా నీవు మానవుడవురా!! ***
**(జిడ్డు కృష్ణమూర్తి గారి బోధనల స్ఫూర్తితో..)**

## తడిసిన గతం

కొండూరు ఆత్రేయ

అటకమీది అనుభవాలూ
అనుభూతులూ, ఆత్మీయతలూ
ఒళ్ళోకి జార్చాను..

కళ్ళు తడిమిన ప్రతిజ్ఞాపకం
ముంగిట్లో మరోసారి
ప్రస్తుతమై ప్రవహించింది..

అర్థించినా ఆగనివి, ఈ నాడు
మునివేళ్ళ మీద ..వెనక్కీ ముందుకీ
చెప్పినట్టు ఆడుతున్నాయి..

గతించి బాధించినా
తిరిగి ప్రసవమై, అపురూపంగా హృద్యంగా అనిపిస్తున్నాయి..
ఇంతలో..మీరు..అక్కడ!

తనివితీరా చూసే లోపే..
తడితెరల వెనక మరుగయ్యారు..
ఎందుకో పెదిమలు అదిరాయి..
చిన్నమూలుగు..వణికిన వేడి నిట్టూర్పు..
గుండెలో శూన్యం బరువుగా..
ప్రతిధ్వనించింది..!

రేగిన అలలు ఇంకా
రెప్పల తీరాలని తగులుతూనే ఉన్నాయి..
తడిసిన ప్రస్తుతం
బరువుగా తిరిగి అటకెక్కింది! ***

## కాంతి పుష్పం

కొత్త ఝాన్సిలక్ష్మి

శ్వేతసౌధపు సుమవనంలో
కాంతిపుష్పం విరిసింది
కిరణకాంతులు వెలుగు రేకలు
దిక్కులంతా పరచింది..

బానిస స్వామిక భావాలన్నీ
తరతమ మానస తేడాలన్నీ
తన కాంతులతో మాయం చేస్తూ
ఓ వెలుగురేఖ మెరిసిందీ..

అన్ని మతముల సారమొకటేనని
స్నేహమొకటే సమ్మతమ్ము
నిశాంతమే మన సౌభాగ్యమని
సమత మమతల మానవత్వపు
శాంతి కిరణం వెలిసింది..

జాతి బేధం మనకు వలదని
రంగుతేడాలెంచబోకని
శ్రమయొక్కటే సాధనమ్మని
సత్యమొక్కటే గమ్యమనీ
శాంతి ప్రవచనం పలికింది..

పరహితమది కొంచెమైనా
మన అభిమతం కావాలని
ఓరిమి కూరిమి భావాలే
మన గలిగిన సూత్రాలనీ..
మనజాతి జీవన వికాసంలో
ప్రతి వ్యక్తీ భాగమనీ
ప్రగతి పథంలో పాలు పంచుకు
సంఘటితమే సౌభాగ్యమని చాటుతూ
దివ్యపరిమళం దిక్కులకద్దుతూ
తేజమలరగ నిలిచిందీ..

పులకిత హృదయాభినందనలు..!
అశేష ఆర్ద్ర నివాళులు..!!

***

## రసరేఖలు

బచ్చోటి శ్రీధర్

భయము నిద్రించునప్పుడు, భయము కనులు
తెరచి వీక్షించునప్పుడు, పరుల నడుమ
భయము, మిత్రులందరి మధ్య భయము, ఎచట
కరిగిననెచట దాగిననచటె భయము

భయము నాలుగు దిక్కుల ప్రజ్వరిల్లి
అట్టహాసమ్ముగా నన్ను చుట్టు ముట్టి
భీష్మకీలల కబళించివేయునంత
పగలు రేయియు విలపింతు పరితపింతు

ఎవ్వరో వచ్చి కత్తులనెత్తుచుంద్రు
ఎవ్వరో చల్లుదురు నిప్పు రవ్వలెన్నొ
ఎవ్వరో విషాన్నమును నాకిచ్చుచుంద్రు
ఎల్లరును నన్ను నిర్జింపనెంచుచుంద్రు

అర్థరాత్రిలో భయము మిన్నంచు దాకి
కలయొ తెలివియొ నిదురయో తెలియనపుడు
గళము పెగులక కన్నీరు కార్చుచుందు
భీత గృహమునకిటుకలు పేర్చుకొందు

కారుచీకటినొకనాడు కనులు విప్పి
దృక్కులను తీక్షణముగ ప్రసరించు వేళ
స్పష్టమై యొక జ్ఞానతేజస్సు తోచె
పట్టి వెన్నాడు భయము నన్వదలిపోయె

***

## అమ్మ నిజం

రవి కిరణం



మన్ను నిజం
మిన్ను మిథ్య
చినుకు నిజం

కళ్ళు నిజం
కలలు కల్ల
కన్నీళ్ళు నిజం

మగువ నిజం
మనసు మాయ
తనువు నిజం

అమ్మ నిజం
అక్క రాదు
ఆలి నిజం

బ్రతుకు నిజం
భయం భ్రాంతి
తెగువ నిజం

కలం నిజం
కవి కల్ల
కవిత నిజం

## మనిషి నామోషీ

సాంజీ శ్రీరామ్, విజయనగరం

నలుగురెదుట నాట్యం చేసేందుకు నెమలికి నామోషీ కాదు
గంతులేసే లేగదూడ జనమంత వింతగా చూస్తారనుకోదు
ఎగరాలని యదలో ఆశ కలిగితే పక్షి ప్రయాణం ఆగేనా?
పాడలని మదిలో కోరిక పుడితే కోకిల గానం ఆపేనా?

ఉరుకులాడేటి ఉడుత చెప్పదా ఆదమరుపులో ఆస్వాదం?
ఉబికి ఎగిసి పడు కడలి అలలలో కనిపించదా ఓ వినోదం?
కానీ మనుషులం ..మనం..??
నవ్వుల పువ్వులు విరిసినా
నయనాన జల్లులు కురిసినా
చీకు చింతలు కుట్టినా
భావాలను బంధించేస్తూ ..మనలో మనల్ని దాచేస్తూ
ఆనందాలను అణిచేస్తూ..మనల్ని మనమే దోచేస్తూ
"పెద్దవాళ్ళమ"ని లోలో ఏవో హద్దులు విధించుకుంటున్నాం
"పేదవాళ్ళమ"ని అసలు నిజాన్ని పూర్తిగా విస్మరిస్తున్నాం
"హుందా" రంగులు వేసుకుని జీవన రంగస్థలమెక్కాం!
జడత్వానికి స్థిరత్వానికి బొత్తిగా వ్యత్యాసం మరిచాం!
వేషభాషలే తెలియని ప్రాణులకున్నాయి భావావేశాలు
వెలికి దూకేటి ఆ వాహినిని అడ్డుకోవు ఏ ఆదేశాలు!
మృగాల కుండని తర్కం మనదని రచించుకున్నాం మానవపర్వం
జంతు గణాధిపతులం మేమని ఏమి చూసుకుని మనకీ గర్వం!?
మనలా మనం మనలేని క్షణం మరణంతో సమానం
మరిలా జనం చస్తే అనుదినం ఈ జగమే 'స్మశానం'..!



## నిరీక్షణ

సన్నిహిత్, హైదరాబాదు



నిశిరాత్రి - నిర్జీవపు రాత్రి
ఆకాశవీధుల్లో విహరించే
నా ఊహల కన్నియను నిర్దయ విధి
కాటేసిన కాళరాత్రి;
బాధల ముళ్ళు గుచ్చి - నా గుండెను
కారిన రక్తపు జల్లు అంటిన-

రుధిరవర్ణపు రాత్రి;
యుగాల సాన్నిహిత్యపు ప్రియ
నెచ్చెలి - నిష్కర్ష నిష్క్రమణ
మిగిల్చిన
- ఒంటరి తనపు వాసన నిండిన
విరహపు రాత్రి;
చేతనాచేతనల నడుమ-
నిట్టూర్పుల వడగాలి విదిల్చిన-
వేదనా భరిత నిశ్శబ్దపు రాత్రి;
నా ఈ చీకటి బ్రతుకున మళ్ళీ
భానూదయం ఎప్పుడో?
వెచ్చటి రవికిరణ స్పర్శ
నా మేనికి తగిలేదెన్నడో?

## మైకేల్ జాక్సన్

డా.కల్లూరి శ్యామల , న్యూఢిల్లీ

**మైకేల్ జాక్సన్**
ప్రపంచం అంతా అందరి నోళ్ళలోనూ
ఈ రోజు నీ పేరు
నీ గొప్పదనాన్ని గురించిన గుణగానం!
ఎవరు నువ్వు మైకేల్ జాకో?
బ్రతికి వున్నన్నాళ్ళూ అనుక్షణం
చస్తూ బ్రతికిన ఒక
విషాదమోహన మూర్తివి!
నువ్వు సృష్టించిన నాదాలు
బ్రహ్మాండమంతా నిండి
నీ స్వరసృష్టి శిఖరాన్ని

చేరుకున్న ఆ రోజులలో నీవేం చేస్తున్నావు?
నిన్ను నిన్నుగా ప్రపంచం గుర్తింపగలిగిన
ప్రతి వ్యక్తిత్వపు గుర్తింపుతోనూ
ఆడుకున్నావు, చెలగాటమాడావు, వ్యక్తిగా ఏ అగాథాల
లోతుల్లోనో కూరుకుపోయావు!
నిన్ను, నీ సంగీత ప్రతిభనీ పూజించిన
ఒక తరం యువతరం నిన్ను ప్రేమిస్తే, వారి
తల్లుల తండ్రుల తరానికి నువ్వొక పతనమైన
విహంగానివి! అతిగా మ్రోగే మృదంగానివి!
నువ్వు తెల్లదొరవా? నల్లనయ్యవా?
నల్లని దొరైనా మా వంశీ లోలుని గానమాధుర్యాన్ని
మా జాతి అంతా పులకించి నేటికీ పూజిస్తున్నదే!
మా జాతిలోనన్నా పుట్టావు కాదు!
ఆడో ,మగో నలుపో, తెలుపో నీకే తెలియని
అంధకారంలో నీకు నచ్చని నీ జీవితాన్ని మార్చుకోలేక
ఎదిగిన వ్యక్తివో , ఎదుగుదల ఆగిపోయి
పసితనంలో నిలిచిపోయిన వింతశక్తివో !?
నీ వెవరివో నీకే తెలియని అంధకారబంధురమైన
ఆత్మలో నుంచి నువ్వు పలికించిన రాగాల
మాధుర్యము , నేటి జీవన జనారణ్యంలో
సెలయేరులా రసస్పృష్టినీ నాద వృష్టినీ నింపుతుంది!
గుండెగుండెలో అలజడిని రేపి
కల్మశంలేని పసితనం కోసం నీ ఆరాటాన్నీ
శాంతి అహింసల కోసం నీ పోరాటాన్నీ
సంగీత ప్రపంచంలో నీ పేరునీ
చిరస్థాయిగా నిలుపుతుంది!
చరిత్రపుటల్లో వ్యక్తిగా నువ్వు అంతరించిపోవచ్చు!
కానీ సంగీత సమ్రాట్టుగా కలకాలం నిలుస్తావు!

## రసరేఖలు

బచ్చోటి శ్రీధర్

గాలి యలలపై విహగము వోలె సాగి
మబ్బుదున్కలలో కన్నుమరగినావు
ముఖమనోజ్ఞద్యుతులు వర్ణములుగ మారి
అందములు చిమ్మె హరివిల్లునందు దాగి

శార్కరము వంటి ధవళ పక్షములు విప్పి
హంసవై యరిగితివి నీలాంబరమున
బాధతో మదినుండి బాష్పములు రాలి
యావిరై గగనాభ నైల్యమున కలసె

నాదు కన్నీరు కాల్వలై నదుల గలసి
నిర్వికార మహాజలనిధిని జేరె
ప్రకృతి పైన నా కనుల కోపాగ్ని రగుల
తేజరిలు భానుబింబమ్ము తెల్లబోయె

గతము కన్నీటి జాలులో కలిసిపోయె
నేడు కనరాదు నాదు కన్నీటికడ్డు
రేపు మాత్రమీ వరదనెట్లాపగలను?
యుగయుగమ్ములు నీకయి పొగిలిపోదు

వచ్చు నినుజూచి మింటి యప్సరసలెల్ల
వరగళమ్ముల పల్కిరి స్వాగతమ్ము
వ్రాయ మొదలిడిరాహ్వాన పత్రమొకటి
కంటికింపుగ మనలనొక్కటిగ జేయ

## కిట్టుడు

ఉమ చింతలపాటి

**అందాల కిట్టుడు** అందెల కిట్టుడు
అందుకోవాలంటే అందనే అందడు..
మువ్వల కిట్టుడు మురిపాలా కిట్టుడు
ముద్దాడుదామంటే మెరుపులా మెరిసి మాయమైపోతాడు
చిన్నారి కిట్టుడు చిట్టి మురళి కిట్టుడు
చేయి చాచి పట్టబోతే చమక్కు చుక్క ఐపోతాడు
చిరునవ్వుల కిట్టుడు చిందేసే కిట్టుడు
పలుకులో తేనె చిలికించే సుమస్వరాల కిట్టుడు
వేణుగానం తో మనసు దోచే దొంగ కిట్టుడు
కనులు మూసి కిలకిల నవ్వి దోగాడే సుమధుర కిట్టుడు..!

## మోహకలాపం

వింజమూరి రాగసుధ - లండన్



**మరుల మందాకిని** గామినియై నఖశిఖ పర్యంతం హొయలు చెలగి
వలపుల తలపుల పొన్నారిమదిని పొంగి సుడులు తిరిగి
మక్కువ మరకత కాంతుల కాంతబింకపు తిమిరం బెదరి చెదరి
కలవరముల కనుదోయిసీమల కకావికలై కదలి కరిగి
తమకపు గమకములు అంచెలంచెలుగా చెలరేగి పెరిగి
ఎలనాగ ఒడిలో అణకువలు ఒదిగి ఒరిగి
అటు ఆలింగనపు సైయ్యాటలలో దేవరుని జంధ్యము జరిగి
ఇటు చెంగల్వపు మోమున దేవేరి సిందూరము ఇంచుక చెరిగి
ప్రకృతి వీక్షణముల అచ్చెరువున సాగు ఆ దివ్యమోహన మోహకలాపం
ప్రణయలహరుల డోలలాడు రసరమ్య సరసోదంతం
కావ్యనాయిక చెక్కిట కులుకుతూ జారు పదబాష్పముల వృత్తాంతం
ఇచ్చలపతి సరసముగా ఇంతికి ఇచ్చిన సరరస ఫలితాంశం
హృదయ కచ్ఛపి పసిడితీగల లంఘించి పలికిన ఆనందరాగం
నిరంతరం హృద్ రమణీయం దైవనిర్మితం ఆచంద్రతారార్కం..!



## గుర్తులు

బొల్లోజు బాబా - కాకినాడ

**నీవెలా ఉన్నావో** అలానే నాకు గుర్తు
పోయిన శరత్తులో నీవెలా ఉన్నావో అలానే నాకు గుర్తు
నీవు ఒక నిశ్చల హృదయానివి.

నీ కళ్ళల్లో వెన్నెల జ్వాలలు కదం తొక్కేవి.
నీ హృదయ జలాలపై ఆకులు రాలుతూండేవి



నా చేతులపై ఎగ్రబాకే, ఆకులతో నిండిన తీగమొక్కలాంటి
నీ స్వరం శాంతంగా, నిమ్మళంగా ఉండేది.
నిబిడాశ్చర్యపు మంటలలో నా దాహం దహిస్తూండేది
ఓ తీయని నీలి కలువ నా హృదయంపై మెలిక తిరిగేది.

నీ నయనాలు దూరమయ్యాయి, శరత్తూ సుదూరంగా ఉంది.
నా ప్రగాఢ వాంఛలు
పిట్టగానం వైపు, ఇల్లులాంటి హృదయంవైపు వలసపోయాయి
నా చుంబనాలు బూడిదలా నేలరాలాయి.

నీ జ్ఞాపకం కాంతితో, పొగమంచుతో, నిశ్చల తటాకంతో తయారు చేయబడింది.
నీనయనాలకావల సుదూరంగా సాయింత్రాలు ప్రకాశించేవి.
యెండు శిశిర పత్రాలు నీ హృదయంలో సుళ్ళు తిరిగేవి
**(మూలం: ఐ రిమంబర్ యు యాజ్ యు వర్ - పాబ్లో నెరుడా)**

## నా కింకేమీ ఒద్దు

ఆత్రేయ కొండూరు

**అయిష్టంగానే! ఎంత మారాను!?**
లేత చేతులు, నిర్మల హృదయం..ఏవీ?

ఒద్దనుకున్న సంగమానికి
ఏమిటీ ఒరవడి? ఎందుకీ పరుగు?

ఆశల పగ్గాలకి చిక్కిన
అసంకల్పిత బ్రతుకు పయనం

ఎవరికోసం?

ఆ పసితనం కంటే నాకేమీ ఒద్దు..
ఈ ప్రస్తుతం అసలొద్దు..
చూడని భవిష్యత్ వసంతాలొద్దు

జనసముద్రంలో నాకై తపనతో వెదికే
ఓ రెండు కళ్ళకోసం నే కన్న కలలు చాలు..

నాకింకేమీ ఒద్దు..!!

## స్వప్న మేఘం

కె క్యూబ్ వర్మ - పార్వతీపురం



**ఒక స్వప్నమేఘం కరిగిపోతూ**
అందరి హృదయాలలో
కన్నీటిని వర్షించింది

స్వప్న పథికుడు మరెవరికీ
అందనంత దూరం
వడివడిగా
నడుచుకుంటూ పోయాడు!

శోధన నాళికలోంచి
స్వప్నలోకాలకు పయనమయ్యాడు!

శిరస్సు తెగిన దీపపు
స్తంభానికి తన జీవన నౌక
లంగరు వేయగా
పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ పోయాడు!

కానీ..
పైకి చూడు నీ మనో నేత్రంతో
ఆయన వేలి చివరల నుండి రాలిన
వెన్నెలాకాశంలో
మంచు శిల్పాలు..!!

## మూగవీణ

గరిమెళ్ళ నాగేశ్వర రావు - విజయనగరం

**వాడు తోటనంతా** కదనకుతూహల రాగంలా కలియదిరిగి
చేవదేరిన ఓ చెట్టు గుట్టని ఎట్టకేలకి పట్టుకుంటాడు..
పనస చెక్కని పదిలంగా మనసు పెట్టి కోస్తూ
మెట్టు మెట్టుకీ ప్రేమని పెట్టుబడిగా పెట్టి
మేరువు మెరుపుల నుండి వీణ కురియ విరుపుల దాకా
రాత్రింబవళ్ళని నగిషీలు చెక్కి ఆకృతిని ఆవిష్కరిస్తాడు.
నరాలను తీసి తీగలు చేసి స్వరాలకి శృతి చేస్తూ
స్వేదం నాదమయ్యే విపంచికి ఊపిరులూదే విరించి వాడు
మునివేలు కొనగోటితో కోటిరాగాలను మీటుతోన్నప్పుడు
మనసు ఆనంద భైరవిని ఆలపిస్తుంది
ప్రణవనాదంలా వీణా వాదనం విశ్వవ్యాపితమౌతోన్నప్పుడు
తనువొక తన్మయత్వపు తంత్రిలా మూర్ఛనలు పోతుంది
పాప్ గీతాల పరవళ్ళ హోరులో
ఎలక్ట్రానిక్ సరిగమల సరికొత్త జోరులో
వీణ మీటే పాట పాతబడుతుంటే..

మూతబడ్డ చేతిపని మూతిని కుట్టేసింది.

వీణ కావాలంటూ ఓ పిలుపు తలుపు తట్టినప్పుడు

వాడి ముఖం వెన్నెలలో బృందావనమై వెలిగిపోయింది

వీణ ఒకటి కావాలట..తీగలతో పనిలేదట..

రూపం అపురూపమవ్వాలట.. రాగాలు మూగబోయినా

ఆకారమే తప్ప ఆత్మతో పనిలేని కృత్రిమత్వాన్ని

షోకుల షో కేసుకి కానుకగా తీర్చి దిద్దాలట

మూగజీవికి ప్రాణం పోయడం తప్పనప్పుడు

బ్రహ్మదేవుడు పడిన బాధేంటో మనకి తెలీదు గానీ

తీగెలు తెగి రాగాలు పలకని ఓ మూగవీణని

చెక్క బొమ్మగా చెక్కుతోన్నప్పుడు

ఉలిదెబ్బలు వాడి మనసుని ముక్క చెక్కలు

చేసింది..నిజం..!!

**(బొబ్బిలి వీణ తయారు చేసే చేతి పనివారు, బొమ్మ వీణలు చేసుకుంటూ పొట్టబోసుకుంటున్న వార్త విని వ్రాసింది)**

## రసరేఖలు

బచ్చోటి శ్రీధర్

**పెరటి తోటలో** దినమెల్ల తిరిగి తిరిగి

మల్లె పూవులనెన్నొ దోసిళ్ళ నింపి

నేలపై యొక్క సుమమును రాలకుండ

తెచ్చుచుంటిని ప్రేమ నీకిచ్చు కొరకు

ఎవ్వడో కొత్త మానిసి యిటకు వచ్చి

పూల సొబగును చూసి తా పొంగిపోయి

ఈయుమంచును తనకు ప్రాధేయపడియె

ఎంత దండిగనో ధనమీయజూపె

కేవలసుమమ్ములా యివి? కావు- నా హృ
దంతర మధురప్రణయ చిహ్నమ్ము లివ్వి
విలువకందనివివియంచు తలతు నేను
ఊహకందని రూకలనొసగు వీడు

పూలనమ్మినచోనేమి పుట్టి మునిగె?
కలయు వనమెల్ల తిరిగి తేగలను మరల
ఇంత ధనమును పొంద నాకెట్టులౌను?
కోరుకొన్నచోనెల్ల నీకొరకు కాదె!

ఒక నిమేషమ్ము హృదయమ్మునుగ్గబట్టి
పూలనన్నియునవ్వాని పాలు జేసి
రిక్తహస్తుడనౌచు చేరెదను నిన్ను
ప్రేమ పలుచనయ్యె ధనము వీడిపోయె



## ఆగని ప్రయాణం

వారణాసి నాగలక్ష్మి, హైదరాబాదు



**ఒక మేఘం తడిపేసి పోతుంది**
ఒక రాగం కుదిపేసి పోతుంది
గుండెల్లో తడి ఉంటే ఒకభావం
పాటైపోయి మనసంతా చుట్టేసిపోతుంది!

ఒక మొగ్గ చిగురుల్లో పుడుతుంది
లేతాకుల పొత్తిలిలో సొమ్మసిల్లి నిద్రిస్తుంది
తొలికిరణం పిలిచిందంటే
పులకిస్తూ వికసించేసి పరిమళమై పోతుంది!

ఒక తలపు హృదయంలో జనిస్తుంది
మదిలోపల మథనై మమకారమౌతుంది
మమతలతో పొదరిల్లేసి
మధుర స్వప్నాలధారలతో రంగవల్లికలల్లేస్తుంది!

ఒక జల సెలయేరై పరుగెడుతుంది
నేస్తాల జతకట్టేసి నది తానై నర్తిస్తుంది
సాగరసంగమానికి సమాయత్తమౌతూనే
వెచ్చని గగన విహారం విలాసంగా సాగిస్తుంది!

ఒక రేఖ చుక్కలుగా విడిపోతుంది
చిరాకు పరాకులతో ఛిన్నాభిన్నమౌతుంది

చక్కని రూపం కోల్పోయి
చిక్కుప్రశ్నే మిగులుతుంది చిన్నబోయి నిలుస్తుంది!

పుట్టిన ప్రతిజీవి ప్రయాసకు లోనౌతుంది
తనదైన ప్రయాణాన్ని తపిస్తూ సాగిస్తుంది
ముందుకు పోతున్నట్టు భ్రమిస్తూ
ఆగని చక్రభ్రమణంలో ఆత్రంగా పాల్గొంటుంది!

## దారులు తప్పినప్పుడు..

రావెల పురుషోత్తమ రావు, గుంటూరు

ప్రతీ పిల్ల కాలువా ఒక నదిగా
ప్రతి నదీ ఒక సముద్రంగా
ప్రతి సముద్రం మహా సముద్రంగా పరిఢవిల్లిన దేశంలో

ప్రతి జిల్లా ఒక రాష్ట్రంగా
ప్రతి రాష్ట్రం ఒక దేశంగా
ప్రతి దేశం ఒక ప్రపంచంగా వెల్లివిరిసిన భూమిలో

ఆకలి అర్రులు చాచి
ఆక్రందనలు చేస్తుంటే
ఆర్ధిక సంక్షోభంలో లక్షలమంది నిరుద్యోగుల
హాహాకారాలు మిన్నంటి వెక్కిరిస్తున్నాయి!

ఆకలికి కులం ఏమిటి? మతం ఏమిటి?
రంగేమిటి? రుచి ఏమిటి?
దాహానికి జాతి మత వివక్షతుందా?

అన్ని రంగాల వారిని
ఆకలి నమిలి మింగేస్తుంది!

ఆలింగనం చేసుకుని
కోరలమధ్య ముక్కలు చేస్తుంది!
సంపన్న దేశమైనా సౌభాగ్య హీన అయితే
మానవత్వపు చిరునామా మలినమై
మకిల పడుతుంది..!

## తొలిజల్లు

అశ్విని శ్రీ



నెర్రలువారి నేలపిల్ల నోరు తెరుచుకుని,
చినుకుల దుప్పటికోసం పేచీ పెడుతుంటే,
విసుగెత్తి వినువీధికి రాజైనోడు,
విసురుగా ఓజలతారు జల్లు విసిరేసాడు
అది చూసిన మా ఊటబావికి కూడ నోరూరిందేమో!
చొంగకార్చింది!

## అసహజపు చూపులు

గరిమెళ్ళ నారాయణ



**జీవితమో అందులోని సంఘటనలో**
ఎలా నచ్చితే అలా ఉండాలని శించడం నేరం కాదు..!
కలల్ని ఎవరూ కబ్జా చెయ్యకూడదు..
దాహార్తివైనప్పుడు
రెండు నీటి బొట్లు చప్పరించాలనుకోవడం తప్పుకాదు.!
శ్వాసందక ప్రాణం పోతోందనిపిస్తుంటే
ప్రాణవాయువు గుండె నిండా నింపుకుని
జీవితానికి న్యాయం చెయ్యాలనుకోవడమూ ఆక్షేపణీయం కాదు.!
ప్రళయ ప్రవాహంలో కొట్టుకుపోతున్నప్పుడు

ఏ ఆధారమో తగులుకుని బ్రతికి బట్టకట్టాలనుకోవడం నిష్ఠూరం కాదు.!

పడి పడి నవ్వాలనుకోవడం
భోరున ఏడవాలనుకోవడం
ఆదమరచి నిద్రపోవాలనుకోవడం
వెన్నెల ఆకాశాన్ని అస్వాదిస్తూ
ఉయ్యాల లూగాలనుకోవడం
ఏదీ ఎవరికీ అభ్యంతరం కానే కాదు..!!
కాని, ఎవరికో ఏదో చేశానని లెక్కలేసుకుని
వాళ్ళేదో చేసి తీరాలని కోరుకోవడం మాత్రం
ఖచ్చితంగా తప్పే!
పదిమందికోసం నీ కొవ్వొత్తి మనసు కరిగినప్పుడు
నీకు తెలీకుండానే నీలో అంతకుమించిన మనిషితనం నిండుతోంది కదా!
నువ్వుకూడా అనేకవేల చేతుల్లో ఎప్పటికప్పుడు
పునరుజ్జీవనం పొందుతున్న వాడవే కదా!
ఇంకా ఎందుకు
'అసహజపు వెనుక చూపులు!'

## జిహాదీలకో కొత్త జన్మనివ్వండి

కలశపూడి శ్రీనివాస రావు



**నా హిందూ ముస్లిం మిత్రులారా!**
జిహాదీలకో కొత్త జన్మనివ్వండి!!
మనిషిగా పుట్టాననుకోవడం లేదు వాడు
ముస్లింగా పుట్టాననుకుంటున్నాడు
ఆదాం, అబ్రహాం,మోసెస్
నోవా, జీసస్ పరంపరలో
మనిషిని మహాశక్తివైపు నడిపించే దిశలో
అరేబియాలో ఆఖరివాడు మొహమ్మద్!
సంసారంలో, వ్యాపారంలో

ధ్యానంలో మునిగిన వాడు
రమదాన్ నాడు అల్లాను దర్శించిన వాడు

గమ్యం తెలియని పలు తెగలకి
తనకు తెలిసినది తెలియ చెప్పి మనుషుల్ని ఏకం చేసే మార్గంలో
పయనించేడు మొహమ్మద్ ప్రవక్తయ్యేడు!
లక్షల ఏళ్ళ కష్టాలని మోసి
ఆఫ్రికా అందించిన మనిషిని,
వేల ఏళ్ళ తపస్సుతో
భారతఖండం అందించిన జ్ఞానాన్ని
వందల ఏళ్ళ  పరిశోధనలతో
ప్రపంచం అందిస్తున్న విజ్ఞానాన్ని
నష్టపరచే పలుమతాల మూర్ఖపు పెద్దలు
ముప్పొద్దులా మిమ్మల్ని రెచ్చగొడితే
దేవుడికోసం దుర్మార్గాలు చెయ్యకండి
దయచేసి నరకాన్ని నేలపైకి దింపకండి!
మతంతో ఏకత్వం
మనిషి అంతానికి ఆరంభం
మానవత్వంతో సమానత్వం
మనుషులంతా ఏకం కావడానికి గొప్పసూత్రం!
కక్ష కట్టకండి..
మనిషిని మాయం చెయ్యకండి!
మాయమైన డైనోసార్లను తలపించకండి!
బుద్ధుడి నుంచి గాంధి దాకా
వారసత్వంగా వచ్చిన బుద్ధిని వాడండి!
అస్త్రం పట్టకుండానే శస్త్రం చెయ్యండి
నష్టం కలగకుండానే కష్టాల్ని తొలగించండి..!
జిహాద్ ని జయించండి!
జిహాదీలకో కొత్త జన్మనివ్వండి.!!

## రెక్కలు తెగిన గులాబి

శైలజా మిత్ర , హైదరాబాదు

ఆ గొంతులో నీరు పృధ్వీతలంపై మేఘం ఏనాడో కురిసింది
ఆ మనిషిలో వెదుకులాట, మనసులో ఆశ ఎపుడో జనించింది
అరచేతిలో వైకుంఠం, నలుదిక్కులా వైవిధ్యం అలవాటయ్యింది
వాన చినుకు మాత్రం ముత్యపు చిప్పలో పడి మెరిసే తారకయ్యింది.

గుడిసె ముందు గడ్డి మొక్క పూలుపూసింది
మేడముందు అవుదూడ ఈత వేసింది
పల్లెతల్లి కరువుచీరతో కడుపునింపుకుంది
పేదరైతు కళ్ళనిండా ఆకాశముంది!

ఎంత త్వరగా శబ్దం నగరాన్ని ఆక్రమిస్తుంది?
అంతకంటే వేగంగా విషాదం జీవితాన్ని అలుముకుంటుంది
వీటిని  చూడలేక సూర్యోదయం మబ్బుల మాస్క్ ధరించి
పచ్చని ఆకుల మధ్య కర్షకుని కన్నీటితో కొత్త చిత్రాల్ని గీస్తుంది
గతస్మృతుల్ని వర్షిస్తూ బీడు భూమి ఆత్మీయంగా పేదరికాన్ని పరికిస్తుంది!

ఉదయం నుండి రాత్రికి, చీకటినుండి వెలుగుకు
మనిషిని నిరీక్షణలో నిలబెడుతుంది
తరతరాల సంస్కృతీ తోరణంలో శరీరం శిధిలమైనా
ఆత్మ మాత్రం బంధాల మధ్య బందీ ఐ ఉంటుంది
అడవులూ, పొలాలు, ఊళ్ళు, పక్షులూ..సమస్త జీవరాసులు
ప్రకృతి తనువుకు ఆనవాళ్ళై ఆకలి మంటల్ని రేపుతుంది!

ఇప్పుడు తనువే తగాదా పడుతోందో, తనంతట తాను వదిలిపోతోందో కానీ
నిత్యం దారుణ మారణ హోమంలో మానవ నాగరికత కుప్పకూలిపోతోంది
పరనింద సమాహారంలో సమిష్టిస్వరం మోగవోతోంది..
తెగిన బంధాల చిరునామా కుట్రలకు పావుగా పనికివస్తోంది..!

ఇప్పుడు ఏ శిరసుకు న్యాయస్థానంలో ప్రవేశం లేదు
ఏ చెట్టు మొదట్లోనో, ఏ గొడ్లచావిడిలోనో
ఏ గోడ వెనుకో, ఏ స్తంభం చాటుకో ముడుచుకుని బతకాల్సిందే!
కవి అయితే నక్షత్రాల కింద
కర్షకుడైతే కన్నీటి ముత్యాల మాటున తలదాచుకోవల్సిందే!
ప్రపంచం మొత్తం వీరి చేతుల్లోనే ప్రాణం పోసుకోవాల్సిందే!
కానీ వీరి పేదరికం మాత్రం రెక్కలు తెగిన గులాబీల్లా
ఒంటరిగా ఉండి పోవాల్సిందే!

## రసరేఖలు

బచ్చోటి శ్రీధర్

**హృదయ పేటికలో నిన్ను పదిల పరచి**

నీవు లేనట్టి జగతి నిర్జీవమంచు
స్వజనమెల్లర విడనాడి వచ్చితేను
అనుపమానంద శిఖరమ్మునందితేను

నీదు కనుసన్నలే నాకు నెలవులయ్యే
నింగి నేలయు ప్రేమ వెన్నెలలు నిండె
భువియె స్వర్గమై యొడలెల్ల పులకలెసగె
కన్న వారలు కరిగిరి కలల యట్లు

ప్రణయ సామ్రాజ్యమున వత్సరములు గడిపి
పెరిగి పిల్లలు పెద్దలై వెడలిపోవ
పరిణతిని చెంది పెద్దల వ్యథ గ్రహించి
వెతను వెనుకకు చూచిన పితరులేరి

తల్లిదండ్రుల నుడులకర్థములు గనక
సమరములనహోరాత్రముల్ సాగనిచ్చి
సమయమెల్లను తుదకు చేజారనిచ్చి
వెనుదిరిగి చూడ కనుల కనిపించునెవరు

ఎల్ల వేళల కూర్చుందురెవ్వరిచట
ఎల్లరము పోవు వారమే యిల్లు వదలి
ఉన్న క్షణముల విలువలనెన్నలేక
ప్రేమ బంధమ్ములను విస్మరింపనేల



## అమ్మవారి ఆవేదన

లక్ష్మీరాఘవ, కర్బలాకోట

అలివేలు మంగమ్మ అలిగి కూర్చుంది!
వెంకటేశ్వరుడు ఏడుకొండలూ దిగివచ్చి
ఎంత అనునయించినా అలకతీరలేదు!
చివరకు గళం విప్పింది అమ్మవారు !!..
సీతమ్మ వారిని పేరంటానికి పిలవాలని
కోదండరాముడి ఆలయానికి వెడితే
నగలు తాకట్టులో ఉన్నాయని సీతమ్మ ఆవేదన!
తాకట్టూ స్వామి వారి అనుమతితోనే అన్నాట్ట పూజారి.!
మరి మీ వారి డాలర్‌లూ తాకట్టేనా అని ఆరా తీస్తే
ఏమని జవాబిచ్చేది?
నగలన్ని తాకట్లకూ, దోపిడీలకూ వెడితే ఎలా స్వామీ?
మన టన్నుల బంగారం క్షేమమేనా?
సంపదంతా గల్లంతైతే
కుబేరుని అప్పుతీరేదెలా?
బొక్కసం తాళాలైనా దాచుకుందాం..
ఇంటి దొంగలనో కంట కనిపెడదాం..
లేకుంటే - మీ కళ్ళకు కస్తూరి నామంతో గంతలు కట్టి
మీ మొలతాడు కూడా తెంచుకుపోతారేమో!?
మీ చెవులకు అడ్డంగా ఆభరణాలు కప్పి
అక్రమాలు మీ చెవిని చేరకుండా చేస్తున్నాయి..!
శివుడ్ని సలహా అడుగాదామంటే

ఇంటి దొంగలు వారికీ దొరకరని ప్రతీతి కదా!
మీరైనా శోధించి, పరిశోధించి
దొంగల ముసుగు తొలగిస్తారా?
పాపాలకు శిక్ష విధిస్తారా?
దేవుడూ కళ్ళు మూసుకోడని నిరూపిస్తారా? ***

## ప్రపంచీకరణ

డి.కామేశ్వరి, హైదరాబాద్

మన మామిడి తాండ్ర
కార్పొరేట్ చీర చుట్టుకుని
మ్యాంగో జెల్లీ వీసా పుచ్చుకుని
మన మాల్స్‌కి వచ్చి చేరింది

మన పూతరేకులు
జిలుగు పొరల వలువల తళతళలతో
నేతి ఘుమఘుమలతో
ఎన్నారై డైనింగ్ టేబిళ్ళనలంకరించాయి

మన పెరటి వేపాకులు
ఎగిరెళ్ళి అమెరికా పేటెంటు పొంది
టూత్ పేస్టూ, సబ్బులలో దూరి
దంత చర్మ మెలకువలు మనకి బోధిస్తున్నాయి

మన పసుపు, గంధం ముద్దలు
రూపం, రంగు మార్చుకుని
అందమైన షేపుల సీసాల్లో, ట్యూబుల్లో దూరి
మనకు సౌందర్య రహస్యాలు చెబుతున్నాయి

మన కుంకుళ్ళ తలలు చితక్కొట్టి
షీకాయ ముక్కుపిండి తీసిన రసం

మనకి తలంటుతున్నాయి

ప్రపంచీకరణ అంటే
మన ముడి సరుకుల రూపులు షేపులు మార్చి
సొగసులద్ది మన మొఖాన కొట్టి
డాలర్ల రూపంలో గుంజడమన్న మాట! ***

## శ్రీశ్రీ

**కృష్ణ అక్కులు**



తెలుగు కవితకు మీరు నవతా సిరి
ఆకలి కేకలు మీ కవితకు ఊపిరి
అవినీతి గుండెల నెత్తురు చేయు ఆవిరి!

అక్షర అక్షర లక్ష్యం
కోరెను పేదవాడి క్షేమం
పదం పదం పదునైన ఖడ్గమై
శ్రమ దోపిడి పై జరిపెను సమరం!

సంధించిన బాణమై దినకర కిరణమై
గమించే మీ కవితా చరణం
చీకటిలోకంలో - తీరని శోకంతో
కలిమి లేమిలో కుమిలే
జనులకో పవిత్ర శ్లోకం!

మండే ఎండలో కండలు కరిగించి
కొండలు తొలిచి బండలు మలిచి
ఊచబియ్యానికి నోచుకోక
గుక్కెడు గంజికి దిక్కులేక
సమ్మెట పట్టిన రెక్కల
కారిన చెమట చుక్కలు

మీ కలానికవి సిరా చుక్కలు!

ప్రజల్లో నాటి చైతన్య బీజం
యువత గుండెల్లో నింపి ఉత్తేజం
దోపిడీ రహిత సమాజం
ఆర్థిక అసమానత లేని రాజ్యం
నిర్మించుటే మరోప్రపంచం
అన్న మీ కవన భావం
నూతన యుగానికది నాందీ వాచకం.!



దగాపడిన తమ్ముళ్ళే
మీ మరోప్రపంచ జవానులు
సుత్తి, కత్తి, కొడవలి, నాగలి
సమ్మెట, గునపం, పనిముట్లే
మీ జవానుల ఆయుధాలు!
డప్పు, ఢంకా, బాజాలే
మీకవి యుద్ధ భేరీ మృదంగాలు..!

మీ శ్వాస ఆగినా మీ కవనం శాసిస్తుంది
రాబందుల అవినీతికి పక్కలో బల్లెమౌతుంది..
క్షోభించే మనసులకి శోభ నిస్తుంది
కృశించే బ్రతుకుల్ని ప్రేమగా స్పృశిస్తుంది
కలకాలం ఇలలో కాంతి మెరుపులు వెలిగిస్తుంది.!

జగతి సుగతి మీ ధ్యేయం - దేశప్రగతిమీ లక్ష్యం
జనహితలోకం మీ స్వప్నం - విశ్వశాంతి మీ ప్రాణం..! ***

## స్త్రీ

విజయ చావలి, ఆస్ట్రేలియా



బాలగా అమాయకత్వం - బేలగా అధార తత్వం
సుకుమారిగా సుగుణాల తత్వం - సుమబాలగా మేధాన్వితం

విద్యార్థినిగా ఉన్నత విద్యారోహణం
మగువగా ఉత్తమ ఉద్యోగ నిర్వహణం
యువతిగా చిలిపిదనం- కుమరిగా తళుకుదనం
యింతిగా మగమనసుల అపహరణం
మరుదంతిగా ఆశయ సాధన సమాహారం

పడతిగా చిరుమందహాసం - సుదతిగా పెళ్ళిపీటలాసనం
శ్రీమతిగా భర్తతో సరాగాలు - కోడలిగా కొత్తింట్లో సరదాలు
కోమలిగా కోపాలు - కోణంగిగా తాపాలు

మహిళగా సమాజంలో గుర్తింపు - ముగ్ధగా ముంగిట్లో మురిపింపు
అమ్మగా దైవత్వం - అతివగా ఆధునికత్వం
ముదిమిగా సర్వమానవ ప్రేమతత్వం - మామ్మగా స్వంతమనవ స్వార్థపరత్వం

సంగీతాన, నాట్యాన, కవిత్వాన, రాజకీయాన
ఆట-పాటలలో, కుటుంబాన , దేశాన
సమస్తవ్యవస్థలో
స్త్రీలేని జాతి త్వరితగతి తిరోగతి!
స్త్రీయే కదా అనాదికాలం స్వర్గానికి పునాది మూలం!

**నాణేనికి మరోవైపు:**
బాలగా అల్లరి తత్వం - బేలగా అసహాయతత్వం
సుకుమారిగా ప్రత్యక్షం - సుమకంటకంగా పరోక్షం
విద్యార్థినిగా విద్యనాస్తి - మగువగా జాణతనం జాస్తి
యువతిగా చిలిపిదనం - కుమారిగా తళుకుదనం

కోమలిగా గారాబాలు - కోడలిగా గాభరాలు
పుట్టింట్లో కూనిరాగాలు - మెట్టింట్లో నయగారాలు
వృత్తిలో కరుకుదనం - ప్రవృత్తిలో నసుగు గుణం

నెరజాణలా, వ్యవహారవేత్తలా నటిస్తూ
కుటుంబాలనీ, కాలనీలనీ, దేశాన్నీ, ప్రపంచాన్నీ
వేలిమీద  ఆడిస్తూ - నరకానికి చేరువగా
తలక్రిందుల చరిత్రకి ప్రత్యక్షకారణం
స్త్రీయే అనేది చరిత్ర చెప్పే సత్యం!

కొన్ని చరిత్రలు మాసిపోడానికి - కొన్ని చరితలు సమసిపోడానికి
స్వర్గధామం కానీ - నరకహోమం కానీ
స్త్రీయే కారణం కాకుంటే చాలు
పుట్టిల్లు పునీతం - మెట్టినిల్లు సార్థకం..! ***

## దోమ - చీమ

వసుంధర



**దోమ కుట్టింది**
ఒక్కటిచ్చాను
తాగిన రక్తం చాలనుకుంటూ
ఎగిరిపోయింది
    చీమ కుట్టింది
    ఒక్కటిచ్చాను
    పేదకు కోపం పెదవికి చేటని
    నలిగి పోయింది
చెడ్డవాళ్లు తప్పులు చేసీ
చేతికి అందరు
మంచివాళ్లు న్యాయంఅడిగీ
మిగిలి ఉండరు

## రసరేఖలు

బచ్చోటి శ్రీధర్



కౌముదీరేఖ హసియించు కలువ నీవు
కలువ హసియింప విరియు జాబిలిని నేను
కలువ పులకించ జనియించునలవు నీవు
అలలకై వేచెడు కొలని యంచు నేను

మింటి వేదిక నిల్చెడు మేఘమేను
మిన్ను మిరుమెట్లు గొల్పెడు మెరపు నీవు
పరిమళానిల జాగృత వనము నేను
నిదుర లేచిన కలకంఠ నినదమీవు

జన్మజన్మలు నినదించు ఝరము నేను
బదులు పల్కెడు శ్రావణాభ్రమవు నీవు
ఎండి నెరియలు పడిన లోయెడద నాది
సఖియవై తాకు జలకణాసారమీవు

పవలు రేయియు గాచునంబరము నీవు
మింటి స్నేహము వీడని మేఘమేను
నింగి నేలయు నిండు వెన్నెలవు నీవు
నిన్ను చేరగ వెలిగెడు నెలను నేను

హిమనగము వోలె నగమున హిమము వోలె
కడలి వోలె కడలి తరంగమ్ము వోలె
కలసి యుందుము జీవిత కాలమెల్ల
కలసి విహరింతుమానంద గగనమందు

# చుక్క ఎదురు

చంద్రుపట్ల తిరుపతి రెడ్డి

**కనుల ముందు**
ఆకాశంలో
మిణుకు మిణుకుమని
తళుకులతో
ఒక చిన్న
చుక్క..

కమ్మిన మబ్బులు
తేలిపోయి
రాల్చలేని
నీటి చుక్క..

పొలాలు దున్ని
ప్రయాసకోర్చి
రైతు కార్చిన
చెమట చుక్క..

ఎదురుచూచి ఎదురుచూచి
వేదన పెల్లుబికి
చాటుగ రాల్చిన
కన్నీటి చుక్క..

తిండిలేక
రాబడి లేక
అమ్ముకున్న
నెత్తుటి చుక్క..

చిన్ని చుక్క గగనంలో
కనులముందు
ఎదురుగా..!

***

## వింత సంస్కృతి (డేటింగ్)   నిడిమామిడి నరసింహ మూర్తి



**ఇంద్రియాలతో** ఆడుకుని
ఒకరినొకరు ఎంగిలి చేసుకుని
వెనుతిరుగుతారు ఇద్దరు
మరో ఇద్దరిని
ప్రోత్సహించడానికి
నిజంగా మనం ఎదిగుతున్నామా? ***

## వర్తమానం   ప్రకాష్ మూర్తి , గుడిపాల, చిత్తూరు

**అమ్మతనం కొలువున్న** మా ఊరిలో అతివలను అమ్మకానికి పెట్టిందీ వర్తమానం
నీటితో నిండిన చెరువున్న మా ఊరిలో కరువు నింపిందీ వర్తమానం
సంక్రాంతి గేయం లాంటి మా ఊరిని సంగ్రామ గాయం చేసిందీ వర్తమానం
ముగ్గులతో నిండిన మా ఊరిని బొగ్గులుగా మార్చిందీ వర్తమానం
తొలిపొద్దు చూసే మా ఊరికి మలిపొద్దు లేకుండా చేసిందీ వర్తమానం
ప్రకృతి ఆనంద తాండవం చేసిన మా ఊరికి ఆకృతి లేకుండా చేసిందీ వర్తమానం
పక్షుల కిలకిల రాగాలను రుచి చూసిన మా ఊరిలో జాతి కక్షల కార్చిచ్చు లేపిందీ వర్తమానం
కోయిల పాటలలో ఆదమరచి నిదురోయే మా ఊరికి కాకి గోల కూడా లేకుండా చేసిందీ
వర్తమానం
మా తాతలు నందించిన మా ఊరిలో మరుతరాలకి  నవాలు కూడా లేకుండా చేసిందీ
వర్తమానం
ప్రేమానురాగాలు వెలుసున్న మా ఊరిలో ప్రేమోన్మాదాన్ని పెంచిందీ వర్తమానం..! ***

## శృతి రెండున్నర — బందా శ్రీనివాస రావు



**దొరకని** చిన్న తునక సెకన్ల ఇసుకల్లో
దొరికిన నిన్న చినుకు రెప్పల కొలకుల్లో
వుందనుకున్న లేమీ...ఇంకా కరగదేమీ
అందుకున్న జాబిలి అంత మసకైందేమీ!

'పీచెస్ అండ్ క్రీమ్' తన మాయానన ఛాయ
ఒక మానసిక శూన్యచిత్రంలో విసర్గమౌతూ
పైకెగసిన జ్వాల తలకట్టై పొగలు జిమ్మి ఆకాశం చెమర్చినపుడు
వెదకబోయిన అర్థం 'నాట్ ఫౌండ్' అంటూ
జీవితపు డిక్షనరీ ఎండినపుడు

అలలు తగ్గి-వలలు వొగ్గి - స్వప్నం ఇటువైపు మళ్ళీ మొగ్గి..

నిజమైన ఉపసంహారం నిరాకారమైన ప్రేమలోకి
కరిగిపోనా - కలిసిపోనా
వెలిసి తెల్లారిపోనా..! ***

## ఇంట్రోవర్ట్ అంతరంగం — దేవరకొండ మురళి

**నా గతం**
నా వ్యక్తిగతం
ఎవరికీ వినిపించని నా స్వగతం
వర్తమానపు పొరల్లో..గుండె లోతుల్లో ..పాతి పెట్టిన మనోగతం

జీవితగమనంలో ప్రతి అపజయం ఓ అశనిపాతం

తనని / తాను ప్రేమించే మనిషికి తన ప్రేమని తెలియపరచటం చేతకాదు.
తనని / తను ద్వేషించే వారికి దూరమవటం కూడా చేతకాదు
కష్టాల్లో, బాధల్లో ఎందుకు నవ్వు వస్తుందో తెలియదు
ఊహించని విధంగా మంచి జరిగినా..సంతోషం కలిగినా..
కన్నీళ్ళు ఎందుకొస్తాయో అంతకంటే తెలియదు..
మనుషుల మధ్య తిరుగుతున్నా ఏదో తెలియని ఒంటరితనం..
ఒంటరిగా ఉన్నా జనం మధ్య ఉక్కిరిబిక్కిరు అవుతున్న ఫీలింగ్!
తనకేం కావాలో తనకే తెలియని సందిగ్ధ మానసం..
తెలియచెప్పే మనసుకోసం మనసున్న మనిషి కోసం
ఆ మనిషి స్పర్శకోసం..తన అన్వేషణ అనంతం..!! ***

## మరోప్రపంచం — వసుంధర



**హిమాలయంలో** జలాశయంలో ఇవేమిటీ నల్ల కాకులు?
అప్పటి హంసల ఇప్పటి రూపం!
ప్రకృతి పెదవుల సమగీతానికి ఇవేమిటీ అపస్వరాలు?
నేపథ్యంలో హైవే, స్కైవే!
శ్రావణ మేఘపు ప్రేమ పలుకులకు ఇవేమిటీ అవాకులు?
అమృతమందున కలిసిన ఆమ్లం!
పళ్లెరమందున మృష్టాన్నంలో ఇవేమిటీ వింత భయాలు?
కల్తీ, క్రిములూ, క్రిమిహారిణులూ!
పీల్చే గాలికి తాగే నీటికి ఇవేమిటీ విషవలయాలు
పారిశ్రామిక పురోభివృద్ధి!
భాస్కరుడిచ్చే ఘన తేజానికి ఇదేమిటీ సాంబుడి జబ్బు?
ఓజోన్ గొడుగుకు పడింది చిల్లు!
సుఖభోగాలే నీవనుకుంటే ఎందుకు నీకీ తడబాటు?

జ్ఞానం ధ్యానం ప్రగతిపథంలో ఇదేమిటీ విలయతాండవమ?
నరుడే హరుడై నాట్య విలాసం!
కన్ను పొడిచినా కానని చీకటి ఎచటికి పోతావీ రాత్రి?
రాతిరి కాదిది పట్ట పగలు!
పవిత్ర భువిపై చరిత్రకందని ఇదేమిటీ మరో ప్రపంచం?
పర్యావరణం మారణహోమం!***

## రసరేఖలు

బచ్చోటి శ్రీధర్

**ఆకసమ్మున తారల హారమీవు**
హారమందున దాగిన హారమేను
సతము చేరువౌ తారల జంట మనము
బంధమెపుడు వీడని గ్రహద్వయము మనము



వంక కనులకానని శుక్రవంక నీవు
వంక ప్రస్ఫుటమగు చంద్ర వంక నేను
కలసి శోభల గూర్తుమాకాశ పరిధి
గురుని యాశీస్సులొసగు క్రొంగొత్త వెలుగు

విల్లునెక్కుపెట్టిన మింటి వీరుడితడు
మంచి విలుకాడు కాని మన్మధుడు కాడు
మిధునమై యొప్పుచు మనము మింటనుండ
చెంతనే యుండి మనల రక్షించుచుండు

నా మనస్సు ధావళ్య వర్ణస్థిరమ్ము
అనల కీలారుణమని వాకొనెదరెవరొ
ఎపుడు భీషణుడైతినో యెరుగలేను
స్వాదుమూర్తిని నేడిది ప్రస్ఫుటమ్ము

ఈ యనంత విస్తృత రోదసీతలమ్ము
దర్పనము మన ప్రేమ సార్ధక్యమునకు
ప్రేమ తత్వమును విధి చిత్రించబోయి
అద్దె వేల ప్రేమికుల చిహ్నమ్ములిట్లు

****